


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 | సంచిక : 312 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | గురువారం 17 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## హస్తినలో ముగిసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం

- జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశం
- దాదాపు గంటన్నర పాటు సమావేశం
- కేంద్రం ఎదుట వాదనలు వినిపించిన ఇరు రాష్ట్రాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన సుమారు గంటన్నర పాటు ఈ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్రమంత్రి సమావేశమయ్యారు.గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ ఎజెండాగా ఆంధ్రప్రదేశ్.. 13 అంశాలతో తెలంగాణ ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలను కేంద్రం ముందు ఉంచాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులతో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

## 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయింది

### రేవంత్ రెడ్డి-చంద్రబాబు భేటీపై కేటీఆర్

- ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ
- ముసుగు వీడింది.. నిజం తేటతెల్లమయిందని కేటీఆర్ ట్వీట్
- తెలంగాణ వ్యతిరేకిని గెలిపించినందుకు ప్రజలకు బూడిద మిగులుతోందని హెచ్చరిక
- కోవర్టులు ఎవరో, తెలంగాణ కోసం కొట్లాడిన వారు ఎవరో తేలిపోయిందన్న కేటీఆర్



వివరాలు 2లో..

## 25 వేల మంది ప్రజాప్రతినిధులు అయ్యే వరకు మా పోరాటం ఆగదు!

- బీసీ రిజర్వేషన్లను సబ్ కేటగరైజేషన్ చేయాలని కవిత డిమాండ్
- రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు ఫలాలు దక్కాలన్న కవిత
- బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలన్న కవిత



**హైదరాబాద్ పెన్ పవర్:**25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యేంత వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆ 25 వేల పదవుల్లో సగం మహి ళలకు కేటాయించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో కవిత సమావేశ మయ్యారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఇప్పటి వరకు

వివరాలు 2లో..

# బనకచర్ల విషయం చర్చకు రాలేదు

- చంద్రబాబుతో భేటీ అనంతరం మీడియాతో రేవంత్ రెడ్డి!
- బనకచర్ల ప్రాజెక్టు కడతామనే ప్రతిపాదన రాలేదన్న తెలంగాణ ముఖ్యమంత్రి
- అలాంటప్పుడు ఆపాలనే చర్చ కూడా ఉండదని వ్యాఖ్య
- కేంద్రం కేవలం నిర్వాహక పాత్ర పోషించిందన్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర జలశక్తి శాఖ మంత్రి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశం అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో బనకచర్ల అంశంపై చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల విషయంలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు అధికారులు, ఇంజినీర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తామనే ప్రతిపాదన ఈ సమావేశంలో రాలేదని ఆయన తేల్చి చెప్పారు. అలాంటి ప్రతిపాదనే రానప్పుడు దానిని ఆపాలనే చర్చ కూడా ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని కూడా ఆయన స్పష్టం చేశారు.

గతంలో కేసీఆర్ తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ఈ సమావేశం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కేంద్రం ఎవరి పక్షానా మాట్లాడలేదని, కేవలం సమన్వయకర్త పాత్ర మాత్రమే పోషించిందని ఆయన పేర్కొన్నారు.

## టెలీమెట్రీలకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది

### తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



- రిజర్వాయర్లు, కెనాళ్ల వద్ద టెలీమెట్రీలు ఏర్పాటు చేస్తామని ఏపీ చెప్పిందని వెల్లడి
- యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని చెప్పిందన్న మంత్రి
- గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించిందని విమర్శలు

వివరాలు 2లో..

## అమెరికాలో కరోనా కొత్త వేరియంట్లు... పెరుగుతున్న కేసులు



- అగ్రరాజ్యంలో కరోనా కలకలం
- ప్రస్తుతం యూఎస్ లో వేసవి సెలవులు... జోరుగా ప్రయాణాలు చేస్తున్న ప్రజలు
- వేగంగా వ్యాపిస్తున్న కరోనా వైరస్

**హైదరాబాద్ పెన్ పవర్:**యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి ఎంతగా వణికించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. లక్షలాది మంది ఈ వైరస్ భూతం బారినపడి ప్రాణాలు కోల్పో యారు. సకాలంలో వ్యాక్సిన్లు రావడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. లేకుంటే మరింత జన నష్టం సంభవించేది. తాజాగా అమెరికాలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో, సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా

వివరాలు 2లో..

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ హోదాలో బుధవారం (జూలై 16) సంగారెడ్డిలో పర్యటించిన మంత్రి వివేక్.. ఇందిరా మహిళా శక్తి సంబరాలు వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇందిరమ్మ ప్రభుత్వం మంచి

వివరాలు 2లో..

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

- 31 జెడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నట్లు వెల్లడి
- 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని వెల్లడి
- 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులను గుర్తించినట్లు వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. రాష్ట్రంలో 31 జెడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానా లు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తెలం గాణ వ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని పేర్కొంది. అదేవిధంగా,

వివరాలు 2లో..

## 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు మంత్రివర్గం ఆమోదం

- కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర మంత్రివర్గం
- శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం
- మంత్రివర్గ సమావేశ వివరాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025-26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ,

వివరాలు 2లో..

## కృష్ణా జలాలను చంద్రబాబు, జగన్ అక్రమంగా తరలించారు... బనకచర్లను ఒప్పుకోం



- కేంద్ర జలశక్తి మంత్రితో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం
- బనకచర్ల అంశం ఒకటే అజెండాగా పెడితే చర్చకు రాలేమని ఇప్పటికే స్పష్టం చేశామన్న కోమటిరెడ్డి
- కాళేశ్వరం కూలిపోతే ప్రపంచ వింత అవుతుందని ఎద్దేవా

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావే శం నేపథ్యంలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. ఏపీ ప్రతిపాదిస్తున్న బనకచర్లను ఒప్పుకునే పరిస్థితే లేదని అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ అంశం ఒక్కటే అజెండాగా పెడితే చర్చకు రాలేమని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేశామని తెలిపారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన కృష్ణా జలాలను చంద్రబాబు, జగన్ ఏపీకి తరలించుకుపోయారని కోమటిరెడ్డి అన్నారు. భవిష్యత్తులో గోదావరిపై నాసిక్ లో ప్రాజెక్టు కడిగే తెలంగాణ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే ఒక వింత అని... అది కూలిపోతే ప్రపంచంలో మరో వింతగా మారుతుందని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ ప్రాజెట్లు మొత్తం కూలిపోతుందని ఇప్పటికే ఎన్డీఎస్ఏ రిపోర్టు కూడా ఇచ్చిందని తెలిపారు.

## ఎడిటర్ వ్యూ

# యూటర్న్ తీసుకున్నట్లేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు రెండు గంటల పాటు మీడియా సమావేశం పెట్టారు. అందులో అన్ని అంశాలను ప్రస్తావించారు. అన్నివర్గాల ప్రజలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కానీ ఒక్క విషయంలో మాత్రం ఆయన స్పందించలేదు. అదే ఇప్పుడు రాజకీయంగానూ, రాజధాని అమరావతిలోనూ హాట్ టాపిక్ గా మారింది. జగన్ మైండ్ సెట్ మారినట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అనేక అంశాలను ప్రస్తావించిన జగన్ రాజధాని రైతుల విషయాన్ని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో ఇరవై వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో జగన్ ఆ ప్రస్తావన లేకుండా సమావేశాన్ని ముగించారు.

### అనేక సమస్యలను ప్రస్తావించి...

మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కరేడు లో భూ సేకరణపై కూడా జగన్ మండిపడ్డారు. మూడు పంటలు పండే భూమిని ఎలా సేకరిస్తున్నారని ప్రశ్నించారు. కరేడు రైతులు తనను కలిశారని, వారికి అండగా వైసీపీ నిలబడుతుందని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ రాజధాని రైతులు రెండో విడత భూ సమీకరణకు అంగీకరించకపోయినా వారి గురించి మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజధాని రైతుల పై ఆగ్రహంతోనే జగన్ వారికి మద్దతుగా మాట్లాడలేదా? లేక జగన్ తన మైండ్ సెట్ ను మార్చుకున్నారా? అన్న చర్చ జరుగుతుంది. అనేక సమస్యలపై పోరాటానికి సిద్ధమని ప్రకటించిన జగన్ రాజధాని భూముల ప్రస్తావన మాత్రం తేలేదు.

### భూ సమీకరణ పై...

గతంలో అసెంబ్లీ సమావేశంలోనే రాజధాని నిర్మాణానికి ముప్పయి వేల ఎకరాల భూములు అవసరమా? అని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు మరో ఇరవై వేల ఎకరాలు సమీకరించడానికి ప్రభుత్వం సిద్ధమయినా ఎందుకు ప్రశ్నించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తానే అంతకు ముందు అవసరమైతే మరిన్ని భూములు సేకరించాలని తాను అన్నమాటలు జగన్ కు గుర్తుకు వచ్చి ఉండవచ్చని కొందరు నెట్టింట నిలదీస్తున్నారు. అయితే ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్లు ప్రచారం జరుగుతున్నా అది తాత్కాలికమేనని, ఖచ్చితంగా భూ సమీకరణ మరో ముప్పయి వేల ఎకరాలను సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు.

### గత ఎన్నికల ముందు వరకూ...

గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ మూడు రాజధానుల అంశంతో జనం ముందుకు వెళ్లి బోల్తాపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదనను మూడు ప్రాంతాల్లో జనం అంగీకరించలేదని 2024 ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతో గత కొన్నాళ్ల నుంచి మూడు రాజధానుల అంశం జగన్ నోటి వెంట నుంచి రావడం లేదు. పైగా ఇటీవల ఆయన గుంటూరు – విజయవాడను కలుపుతూ రాజధాని నిర్మాణం చేపడితే బాగుండేదని కూడా అభిప్రాయపడ్డారంటే ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనపడుతుందంటున్నారు. అందుకే జగన్ రాజధాని అమరావతి విషయంలో జరిగే విషయాలను కొంతకాలం పరిశీలించిన తర్వాత మాత్రమే రెస్పాండ్ కావాలని భావిస్తున్నట్లుంది. అందుకే రెండు గంటల పాటు జరిగిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతి పేరు కూడా తేకుండా జగన్ జాగ్రత్త పడ్డారంటున్నారు.

# కారంచేడు మారణహోమానికి 40 ఏళ్లు




కారంచేడు ఘటన దేశంలోనే దళితుల ఆత్మగౌరవ ఉద్యమానికి ఒక ప్రతీకగా నిలిచింది. తెలుగు నేలపై సామాజిక ఉద్యమాలకు దళితులు తన నెత్తుటితో అంకురార్పణ చేసిన ఘట్టానికి కారంచేడు ఉద్యమం ఒక స్ఫూర్తి. ప్రకాశం జిల్లాలోని కారంచేడు ఘటనా దళితుల విముక్తి పోరాటాలకు ఒక ప్రతీక. ఆదిపత్య కులాల దురంహకారాన్ని, దౌర్జన్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన ఘటన కారంచేడు మారణహోమం. కారంచేడు కమ్మ భూస్వాముల దాడిలో అమరులైన ఆరుగురిని స్మరిస్తూ ఏటా దళిత సంఘాలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులందరూ జూలై 17న కారంచేడు మృతవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆనాటి కారంచేడు ఘటనకు నేపథ్యం ఏమిటని పరిశీలిస్తే 1985 జూలై 16న అంటే ఘటనకు ముందురోజు కారంచేడు దళితవాడలోని మంచినీటి చెరువు (మాదిగ కుంట)లోకి పశువులు తాగిన కుడితి నీటిని పోతిన శ్రీనివాసరావు చెరువులో పోయడంపై ఊరిలోని కమ్మ భూస్వాములకు మాదిగ పల్లెకు మధ్య చెలరేగిన వివాదం కారంచేడులో నరమేధానికి కారణమైంది. 1985 జూలై 16న అంటే ఘటనకు ముందురోజు కారంచేడు మాదిగ వాడలోని మంచినీటి చెరువులోకి పశువులు తాగిన కుడితి నీటిని కమ్మ కులానికి చెందిన పోతిన శ్రీనివాసరావు చెరువులోకి పోశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న దళిత వికలాంగ యువకుడు కత్తి చంద్రయ్య మంచినీళ్లు తాగే చెరువులోకి పశువులు తాగిన కుడితిని ఎందుకు పారబోశావని అడిగాడు. కులదురహంకారం నెత్తికెక్కిన పోతిన శ్రీనివాసరావు నన్నే ప్రశ్నించేంతటి వాడవయ్యావా? అంటూ చర్నాకోలాతో చంద్రయ్యను కొట్టాడు. అంతలోనే మంచినీటి కోసం వచ్చిన దళిత మహిళ మున్నంగి సువార్తమ్మ అన్యాయం అని అడిగిన వికలాంగ యువకుడిని కొట్టడం ఏమిటని గట్టిగా నిలదీసింది. నన్నే ప్రశ్నిస్తావా అంటూ ఆమెను అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ పొత్తికడుపు మీద తన్నాడు. ఆత్మ గౌరవం కోసం మున్నంగి సువార్తమ్మ తన చేతిలో ఉన్న మంచినీటి బిందెతో తిరగబడింది. దానికి అవమానంగా భావించిన శ్రీనివాసరావు అంతటితో ఆగక కారంచేడు చుట్టు పక్కల గ్రామాలైన స్వర్ణ, కుంకలమర్రు, నాగులపాలెం, జాగర్లమూడికి చెందిన కమ్మ కులస్తుల్ని రెచ్చగొట్టి రాములోరి గుడి దగ్గర రాయినీడు ప్రసాద్, చాగంటి నాయుడమ్మ (వడ్డీల నాయుడు), చాగంటి కృష్ణారావు, మద్యంషాపు రాయినీడు సీతారామయ్యలతో పాటు మరికొందరి ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు సమావేశం ఏర్పాటు చేశారు. రాములోరి గుడి దగ్గరే కారంచేడు మాదిగ పల్లెపై దాడికి ప్రణాళిక రచించారు. జూలై 17న తెలతెలవారుతున్న వేళ కత్తులు, బరిసెలు, గండ్రగొడ్డళ్లు చేతబట్టి మాదిగపల్లెపై దాడికి పాల్పడ్డారు. ప్రాణాలు అరచేతబట్టుకుని పంటపొలాల్లోకి పరుగులు తీసిన దళితుల్ని జింకను వేటాడినట్లు వేటాడి నరికి చంపారు. వీళ్ళు ఇంతటి నరమేధానికి, రాక్షసత్వానికి పాల్పడతారని బాధితులు ఊహించనే లేదు. అగ్రవర్ణాల పదునైన అధికార కత్తులకు ఈ నరమేధంలో తేళ్ళ యెహోషువా, దుడ్డు వందనం, తేళ్ల ముత్తయ్య, దుడ్డు రమేశ్, తేళ్ళ మోషే, దుడ్డు అబ్రహాంతో సహా మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది క్షతగాత్రులయ్యారు. తర్వాత కొడుకు హత్యకు ప్రత్యక్ష సాక్షి అయినందుకు దుడ్డు ఆలీసమ్మను విషప్రయోగంతో హత్య చేశారు. నేటికి బాధితులు ఆశించిన స్థాయిలో నేరస్తులకు శిక్షలు పడలేదు. ఆనాడు దినపత్రికలు జరిగిన అన్యాయాన్ని పతాక శీర్షికలతో ప్రపంచానికి తెలియజేశాయి. ఇలా ఎంతోమంది కవులు, కళాకారులు, ఉద్యమ కారులు, సామాజికవేత్తలు, కారంచేడు ఘటనను తమ ఆట, పాటల ద్వారా ఈ సమాజానికి తెలియజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపారు. కత్తి పద్మారావు, బొజ్జా తారకం, సలగల రాజశేఖర్, విక్టర్ సాంసన్, కోటి జేమ్స్ వంటి మేధావులు బాధితుల పక్షాన నిలుస్తూ 28 డిమాండ్లతో ఉద్యమం చేపట్టారు. ఆనాటి పోరాటాల నుంచి నిత్యం స్ఫూర్తి పొంది దేశంలోని దళితులందరూ ఏటా జూలై 17 వ తేదిన "కారం చేడు మృత వీరుల సంస్మరణ' దినంగా జరుపుతుంటారు. కారంచేడు ఉద్యమం దేశంలో అనేక చట్టాల రూపకల్పనకు ప్రేరణగా నిలిచింది. 1989 ఎస్సీ/ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్టు (అత్యాచారాల నిరోధక చట్టం) రావడానికి కారణమైంది. 1991లో జరిగిన చుండూరు నరమేధం ఘటనలో ప్రత్యేక కోర్టును ఘటన జరిగిన ఊరిలోనే ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటివరకు హరిజనులుగా, ఎస్సీలుగా పిలువబడుతున్న వారిని దళిత, బహుజన అనే చైతన్యవంతమైన పదాల్ని ప్రజలకి పరిచయం చేసింది కారంచేడు ఉద్యమం. దళితుల సంక్షేమ చట్టాల రూపకల్పనలో కారంచేడు ఘటన ప్రభుత్వాలకి ఒక రిఫరెన్సులా నేటికీ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆధిపత్య కులాలు దళితుల్ని ఆచితూచి మాట్లాడేలా మార్పు తీసుకొచ్చింది కారంచేడు ఉద్యమం. కారంచేడు, చుండూరు దళిత ఉద్యమాల ప్రభావంతోనే ఆనాటి కేంద్ర ప్రభుత్వం బి.ఆర్. అంబేద్కర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 1991లో ఆయనకు 'భారత రత్న' ను ప్రదానం చేసి పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించింది. దీంతో కారంచేడు ఘటన చరిత్రలో ఒక మలుపు. కారంచేడు ఉద్యమ సమయంలో బాధితుల పక్షాన నిలిచి పునరావాసం కల్పించడంలో కీలకపాత్ర పోషించిన నాటి ప్రత్యేక ఐ.ఎ.ఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని కారంచేడు బాధిత గ్రామం, చీరాల, విజయనగర్ కాలనీలో ప్రతిష్టించుకున్నారు. దళితుల ఆత్మగౌరవ ఉద్యమాలకు, దళిత రాజ్యాధికార సాధనకు కారంచేడు మృతవీరులు అందించిన స్ఫూర్తితో దళిత బహుజన సమాజం ముందుకు నడవాలని ఆశిస్తూ మృతవీరులకు జోహార్లు అర్పిస్తున్నాను.



డాక్టర్ మున్నంగి నాగరాజు
(కారంచేడు బాధితుడు)
జాతీయ అధ్యక్షులు
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి
(ఎం ఆర్ పి ఎస్ )
(కారంచేడు మారణహోమానికి
40 ఏళ్లు అయిన సందర్భంగా)
మొబైల్ నం : 9154229156

# 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయింది

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. "ముసుగు వీడింది, నిజం తేటతెల్లమయింది.. 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయింది" అంటూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "తెలంగాణ వ్యతిరేకిని ముఖ్యమంత్రిగా గెలిపించినందుకు నిధులు రాహుల్ గాంధీకి, నీళ్లు చంద్రబాబుకి... బూడిద తెలంగాణ ప్రజలకి!" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరు రాష్ట్రాల సమావేశంలో బనకచర్ల గురించి చర్చకు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుకాయించారని ఆరోపించారు. గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పజెప్పటం కోసమే రేవంత్ రెడ్డి గద్దెనెక్కారా? అని నిలదీశారు. జై తెలంగాణ అనడానికి ఉన్న సిగ్గు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హక్కులను చంద్రబాబుకి ధారపోయడానికి మాత్రం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోవర్టులు ఎవరో, తెలంగాణ కోసం కొట్లాడిన వారు ఎవరో ఈరోజుతో తేలిపోయింది.

నీ గురువుపై విశ్వాసం చూపించడానికి తెలంగాణ విధ్వంసం కావలసిందేనా? ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు? నిన్ను ఎన్నుకున్న పాపానికి సరిహద్దులు చెరిపేయి. అప్పుడు తెలంగాణా మీద నీ అక్కసు చల్లారుతుందేమో! జై తెలంగాణా అనాల్సిన బాధ నీకు తప్పుతుందేమో!" అని రాసుకొచ్చారు.

ఒక్క మాట గుర్తు పెట్టుకో... ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా, మరో పోరాటం చూస్తావని హెచ్చరించారు. "ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి, తరిమి కొడతాం! ప్రాంతం వాడు మోసం చేస్తే ఇక్కడే పాతి పెడతాం! తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని తప్పక పడతాం!" అని హెచ్చరించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

అవకాశమన్నారు. మహిళలు వ్యాపారాలపై ఫోకస్ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా మహిళలకే ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ఖజానాని ఖాళీ చేశారని.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారు. రైతులు, మహిళలను కోటీశ్వరులు చేస్తానని చెప్పారు. కానీ ఏ ఒక్క హామీ నేరవేర్చలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబ సభ్యులు మాత్రం వందల కోట్ల రూపాయలు సంపాదించి కోటీశ్వరులు అయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా ప్రతి పేదవాడు సన్నబియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అయితున్నా.. మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆపకుండా వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్మికులకి కనీస వేతనం ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇదే కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను పట్టించుకోలేదని.. కానీ గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో పేదరిక నిర్మూలన కోసం ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని కొనియాడారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి మహిళలు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

# 25 వేల మంది ప్రజాప్రతినిధులు అయ్యే వరకు మా పోరాటం ఆగదు!

- మొదటి పేజీ తరువాయి

రాజకీయ అవకాశాలు దక్కని కులాల కోసం సబ్ కోటా ఉండాలని ఆమె కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీపీలుగా ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో, అవకాశాలు దక్కని కులాల కోసం సబ్ కోటా ఇవ్వడం కూడా అంతే ముఖ్యమని కవిత స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని, అది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని ఆమె వెల్లడించారు. ఇదివరకే రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగులో ఉన్నాయని ఆమె తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగులో ఉందని, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దానికి ఆమోద ముద్ర వేసి బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై గెజిట్ విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసినా, ఎవరైనా కెవియట్ దాఖలు చేయకుంటే, కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటే, సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఆమె అన్నారు. రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు ఫలాలు చేరాలంటే సబ్ కేటగరైజేషన్ ఒక్కటే మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

- మొదటి పేజీ తరువాయి

12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేసింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల కాలపరిమితి గత ఏడాది ప్రారంభంలో ముగిసింది.

# 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు మంత్రివర్గం ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.

# అమెరికాలో కరోనా కొత్త వేరియంట్లు... పెరుగుతున్న కేసులు

- మొదటి పేజీ తరువాయి

వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 మరియు ఎక్స్ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ కొత్త వేరియంట్ల ప్రభావం వల్ల గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని, సాధ్యమైనంత వరకు సామాజిక దూరాన్ని పాటించాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు

# అడవి బిడ్డలకు విద్యాధానం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని డేరాల గ్రామంలో విద్యార్థులకు నోట్ బుక్స్, ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళు,, కామ్పస్సు బాక్స్‌లు తదితర విద్యా సామాగ్రిని గూడెం కొత్తవీధి డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ మాట్లాడుతూ "పిల్లలను నిత్యం పాఠశాలకు పంపాలి. పేదరికాన్ని జయించేందుకు విద్యే ప్రధాన ఆయుధం. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తమ పిల్లల భవిష్యత్తు కోసం విద్యను ప్రోత్సహించాలి," అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మొట్టడం రామారావు,లకే రామచంద్రుడు,ఈశ్వరమ్మ, దేవేంద్ర, చిన్నబాయ్, రాంబాబు పాల్గొన్నారు. అలాగే పాఠశాల హెడ్ మాస్టర్ దొండ కాళేశ్వరరావు,విఆర్ఓ తసకండ్ల వెంకటేశ్వర్లు, మాదాల విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యకు ప్రోత్సాహం లభించడమే కాకుండా, గ్రామస్థుల్లో చైతన్యమూ పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# వరిలో జీవన ఎరువుల వాడకంపై క్షేత్రస్థాయిలో అవగాహన

**గ్రామీణ రైతులకు అవగాహన కల్పించిన క్రాంతి వ్యవసాయ పరిశోధన స్థానం**





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలోని దుచ్చెరపాలెం గ్రామంలో వరిలో జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి నికర ఆదాయాన్ని పెంచేందుకు సహాయపడే జీవన ఎరువుల ప్రయోజనాలను గిరిజన రైతులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా క్రాంతి వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి. బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ "రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు నత్రజని, భాస్వరము మరియు పొటాష్ పోషకాలను అందించగలిగే జీవన ఎరువుల వాడకం ద్వారా రైతులకు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది," అని పేర్కొన్నారు. దుచ్చెరపాలెం గ్రామానికి చెందిన నారాయణ పడాల్ పొలంలో ఒక ఎకరా ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు. నారు నాటుటకు ముందు 200 కిలోల పశువుల ఎరువులో 500 మిల్లీ లీటర్ల చొప్పున అజోస్పైరిల్లం, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా, మరియు ఫాస్ఫరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియాలను కలిపి దమ్ముగా చల్లి మొక్కల వృద్ధిని పరిశీలించారు. ఈ జీవన ఎరువుల వాడకం ద్వారా భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య గణనీయంగా పెరిగి, మొక్కలకు అవసరమైన పోషకాలు, హార్మోన్లు మరియు విటమిన్లు అంది మొక్కలు ఆరోగ్యంగా వృద్ధి చెందుతున్నట్లు డాక్టర్ రెడ్డి వివరించారు. అదనంగా, ఇవి సహజసిద్ధమైనవి కావడంతో వాతావరణ కాలుష్యం కలిగించకపోవడంతో పాటు పంటకు ఎలాంటి హానీ కలగదని చెప్పారు. ఈ ప్రదర్శన క్షేత్రంలో గ్రామానికి చెందిన నడిపి పడాల్, సాగిన ధర్మపడాల్ మరియు నారాయణ పడాల్ పాల్గొన్నారు. రైతులు ఈ విధానాన్ని ఆసక్తిగా పరిశీలించి తమ భవిష్యత్తు సాగులో వినియోగించేందుకు సిద్ధత చూపారు.

# ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**గాజువాక: పెన్ పవర్,జూలై 16:** పెదగంట్యాడ మండలం, పెదకోరాడ గ్రామానికి చెందిన మొక్క కనకరాజు అనే యువకుడు మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తూ పడిపోయి, నడుం కింద భాగంలో తీవ్రమైన ఫ్రాక్చర్ అయింది. అంతేకాకుండా పచ్చకామెర్లుతో పాటు లివర్ ఇన్ఫెక్షన్ కూడా రావడం వల్ల గత 40 రోజులుగా విశాఖపట్నంలోని కేజీహెచ్ హాస్పిటల్ లో ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నాడు.

ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని జాగరపు శ్రీను మిత్రబృందంతో కలిసి రూ.25,016 సేకరించి కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా విప్లవ భారత్ ట్రస్ట్ ఫౌండర్ బ్లడ్ మాన్ వినోద్ బాలు నిత్యావసర సరుకులను అందించారు.

ఈ కార్యక్రమంలో సుధమల్ల పవన్, బాస ప్రసాద్, పల్లం గిరి, గంధం సాయి, శ్రీరామ్, విషం అజయ్, సుధమల్ల శ్రీను, ప్రవీణ్, రవీంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన చిన్నారులు తల్లిదండ్రులకు ప్రభుత్వం ఎక్స్గ్రేషియా ఇవ్వాలి





**హుకుంపేట పెన్ పవర్ జూలై. 16** హుకుంపేట మండలం లోగల గడ్డిమర్రి గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు ప్రమాదవసత్తు దొంతిరాయి గ్రామంలో వున్నా చెరువులో మునిగి చనిపోయిన విషయం విధితమే. ఇందుములంగా

ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండలకమిటి

హుకుంపేట మండలం గడ్డిమర్రి గ్రామంలో ప్రమాదవశత్తూ చెరువులో మునిగి మరణించిన చిన్నరిల కుటుంబానికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర,మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్, హైమవతి ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండలకార్యదర్శి టి. కృష్ణారావు బృందం పర్యటించి బాధిత కుటుంబానికి పరమర్శించడమైనది చనిపోయిన బాధిత కుటుంబానికి ఒక్కొక్కరికీ 5 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేసారు

హుకుంపేట మండలంలోని గడ్డిమర్రి గ్రామంలో 14/7/25న ప్రమాదవసత్తు. చెరువులో మునిగి గడ్డి మర్రి గ్రామానికి చెందిన 3 వ తరగతి చదువు తున్న గేమ్మెలి సంతోష్,గేమ్మెలి అఖిల్ చనిపోయారు

చనిపోయిన చిన్నారి కుటుంబానికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర,ఆదివాసీ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్, హైమవతి, హుకుంపేట ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టీ.కృష్ణ రావు అంతక్రియలో హాజరై బాధిత కుటుంబానికి పరమర్శించారు

అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ

ప్రమాదవసత్తు చెరువులో మునిగి మరణించిన చిన్నరిల కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వంతక్షణమే ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు బహిరంగ చెరువుకు రక్షణ కంచెలు ఏర్పాటు చెయ్యాలనీ డిమాండ్ చేశారు భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు.

# బదిలీపై వెళ్తున్న వారికి ఘన సత్కారాలు. చేసిన సర్పంచ్.





**హుకుంపేట పెన్ పవర్ జూలై 16 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట. మండలం హుకుంపేట సచివాలయంలో గల సచివాలయం సిబ్బంది బదిలీపై వేరే మండలాలకి వెళ్తున్న సందర్భంగా సచివాలయ సిబ్బందికి సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించరు అనంతరం. బదిలీపై వెళ్తున్న. సిబ్బందిను. దుస్సాలువతో సన్మనించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరంలు గా హుకుంపేట సచివాలయనికి మంచి సేవలు అందించారాని, ప్రజలు కు ఎప్పుడు అందుబాటులో ఉంటూ మంచి సేవ లు అందించి బాధ్యతయూతంగా సేవలు అందించారని వారి సేవలను కొనియాడారు అని ఆమె అన్నారు. బదిలీ పై వెళ్తున్న వేరే ప్రాంతలలో కూడా ప్రజలుకు మంచి సేవలు అందించాలని ప్రజలు మనల్ని పొందాలని ఆమె. అన్నారు ఈ కార్యక్రమంలో సెక్రటరీ సత్యనారాయణ,ఎంపీటీసీ రమ, వైస్ సర్పంచ్ గోవింద్, వి ఆర్ వో రత్న కుమారి, వార్డ్ మెంబెర్స్ వెంకట్, నాగబాబు, లక్ష్మణ్, అన్నపూర్ణ, పేసా కమిటీ సభ్యులు గణేష్ వైసీపీ మండలం అధ్యక్షులు అనిల్, గండేరు సత్యం పాల్గొన్నారు

# ఏజెన్సీలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి






- ఐటీడీఏ ఇన్చార్జి పిఓ జె.సి డాక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ్
- మేడ్ ఇన్ అరకు బ్రాండింగ్‌తో గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై16:** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు సేంద్రీయ వ్యవసాయం పట్ల మరింత ఆసక్తి కనబరచాలని, ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించాల్సిన అవసరం ఉందని ఐటిడిఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ్ తెలిపారు. బుధవారం పాడేరు ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన "సేంద్రీయ వ్యవసాయంపై డివిజన్ స్థాయి ఒకరోజు వర్క్ షాప్"లో ఆయన మాట్లాడుతూ, గిరిజన రైతులకు ఆర్థికాభివృద్ధి కల్పించటమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని, "మేడ్ ఇన్ అరకు" బ్రాండ్ పేరుతో గిరిజన ఉత్పత్తులను ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. వరి పంటలకు ప్రత్యామ్నాయ పంటలైన చిరుధాన్యాల సాగు పెంపొందించాలని, చిరుధాన్యాల వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులు వాటి పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. గిరిజన రైతుల ఉత్పత్తులైన కాఫీ, రాగులు, పసుపు, అల్లం, సామలు, కొర్రలు మొదలైన పంటలకు మంచి గిట్టుబాటు వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నామని తెలిపారు. అలాగే, దళారీ వ్యవస్థను అరికట్టేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దృఢంగా పని చేయాలని సూచించారు. ఇ-మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. రైతుల ఆదాయం పెరగడానికి ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెటింగ్ మద్దతు అవసరమన్నారు.

**పసుపు పంటలకు బీమా సదుపాయం**

జిల్లా ఉద్యానవన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు మాట్లాడుతూ, గిరిజన రైతులు సేంద్రీయ పద్ధతిలో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. పసుపు సాగు చేసే రైతులు ఈ నెల 31వ తేదీ లోపు ఒక్కో ఎకరా కోసం రూ.1336 చెల్లించి పంటల బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టపోతే రూ.88 వేలు వరకు బీమా పరిహారం అందుతుందన్నారు.

**సేంద్రీయ వ్యవసాయంలో ముందున్న గిరిజనులు**

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్ మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పరిధిలో 35 వేలమంది రైతులలో 14 వేలమంది పూర్తి స్థాయిలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులు 40 వేల ఎకరాల్లో వరి, 16 వేల ఎకరాల్లో రాగులు సాగు చేస్తున్నారని తెలిపారు. రసాయనిక ఎరువులు, మందుల వినియోగం తగ్గిందని అన్నారు.

**బ్యాంకుల మద్దతుతో దళారీ వ్యవస్థ అదుపులోకి**

వర్క్ షాప్ లో పాల్గొన్న పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ, రైతులకు బ్యాంకులు పెట్టుబడి సాయం అందిస్తే దళారులను నియంత్రించవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు బ్యాంకులు ఆర్థిక సహకారం అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, ఎపిసిఎన్ఎఫ్‌డిపిఎం ఎస్.జె.వి. రామ మోహన్ రావు, కాఫీ బోర్డు డిడి హెచ్. మురళీధర్, జిల్లా సెరికల్చర్ అధికారి కె. అప్పారావు, పి.హెచ్.ఓ. ఎ. రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదివాసీ మిత్రా వెల్ఫేర్ సొసైటీ, ఎస్‌విఎం, జయంతి స్పైసెస్, మన్య తోరణం, దండకారణ్యం, అల్లూరి ఎన్‌జిఒ, అమృత ఎన్‌జిఒ తదితర సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# గంజాయి కేసుల్లో నిందితుల ఆర్థిక మూలాలను వెలికి తీయాలి

- డెంకాడ పోలీసు స్టేషన్ను సందర్శించిన
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయ నగరం, జులై 16 :** విజయ నగరం జిల్లా డెంకాడ పోలీసు స్టేషన్ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జూలై 16న సందర్శించి, పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ ను పరిశీలించి, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల ఆర్థిక మూలాలను వెలికి తీయాలని, గంజాయి వ్యాపారంతో సంపాదిం చిన ఆస్తులను జప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల ఆర్థిక మూలా లను వెలికి తీయాలని, గంజాయి వ్యాపారంతో సంపాదించిన ఆస్తులను గుర్తించి, వాటిని జప్తు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గంజాయి కేసుల్లో మరింత లోతై న దర్యాప్తు చేయాలన్నారు. రహదారి ప్రమా దాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టా లని, బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులను, స్టాపర్లు, లైటింగు ఏర్పాటు చేయాలన్నారు. హి ట్ అండ్ రన్ కేసుల్లో క్రైం వాహనాలను త్వరిత గతిన గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని, నిందితులను అరెస్టు చేయాలని, బాధితులకు పరిహారం అందే విధంగా చూడాలన్నారు. అనం తరం, పోలీసు స్టేషనులోని వివిధ రికార్డు లు, సిడి ఫైల్స్ ను, జనరల్ డైరీ, బెయిల్ బుక్లను తనిఖీ చేసి, అధికారులకు దిశా నిర్దేశం చేసారు. రికార్డులు, సిడి ఫైల్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తుండాలి, దర్యాప్తు వివరాలను సిసిటిఎన్ ఎస్లో నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పోలీసు స్టేష నును జిల్లా ఎస్పీగ తనిఖీచేసే సమయంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగా పురం సిఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్.ఐ ఎ.సన్యాసి నాయుడు మరియు ఇతర పోలీసు సిబ్బంది హాజరుగా ఉన్నారు.

# ప్రజల అవసరాలే తెలుగు దేశం అజెండా

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు**

**బిమిలి, పెన్ పవర్, జులై 16 :** ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్య లను పరిష్కరించడమే అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు భీమిలి నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాస రావు సూచనలు మేరకు సుపరిపాలన - ముంద డుగు కార్యక్రమం బుధవారం భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధిలో జరిగింది. గంటా నూకరా జు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ద్వారా ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం నెరవేర్చిన హామీలు, చేసిన అభివృద్ధిని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రెట్టింపు చేసిన పరిహారం గాని, బడిపిల్లలకు తల్లికి వందనం గాని, ఉచిత గ్యాస్ సిలిండర్లు గాని, ఉచిత బస్ ప్రయాణం గాని, పెంచిన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు గాని, డిఎస్సీ ఉద్యోగాలు గాని, స్కూల్ పిల్లలకు సన్నబియ్యం తో ఆహారభద్రత గాని ఈవిధంగా చెప్పుకుంటూ పోతే కూటమి సర్కార్ పేద ప్రజల సంక్షేమం కోసం ఏవిధంగా పనిచేస్తుందో అర్థమవుతుం దని అన్నారు. కొన్ని కారణాలు వలన తల్లికి వందనం, మత్స్యకారుల భరోసా లాంటి పథకాలు యొక్క సొమ్ములు పడకపోతే దానిని కూడా సరిచేసి జూలై, ఆగస్టు నెలలో అసలైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. పేద ప్రజల కష్టాలు తీర్చి వారికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేవిధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని అన్నారు. రాష్ట్రం పురోభివృద్ధివైపు అడుగులు వేస్తుందని అన్నారు. మహిళలకు రక్షణ, యువతకు ఉపాధి అవకాశాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంకి వెన్నంటి రాష్ట్ర ప్రజలు ఉన్నారని, మరొక రెండు దశబ్దాలు కూటమి అధికారంలో ఉంటుందని గంటా నూకరాజు ఆశాభావం వ్యక్తం చేసారు ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, నెక్కెళ్ళ వెంకటరావు, శ్రీను స్వామి మహిళలు పాల్గొన్నారు.



# వైసిపి నాయకులు 100 మంది జనసేనపార్టీ లో చేరిక





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 16** :విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే మరియు జనసేన పార్టీ నగర అధ్యక్షులు అయిన లివంశీ కృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన నాయకు రాలు కొల్లి సింహాచలం, ఆధ్వర్యంలో 39వ వార్డ్ కు చెందిన కన్వీయర్ బెల్ట్, చిలక పేట, కోట వీధి కి చెందిన వైస్సార్సీపీ నాయకులు ఎం. రమణమ్మ, పి. సన్యాసమ్మ, నాగలక్ష్మి, అత్తిలి శ్రీను, వాడిశెల అప్పారావు, అప్పన్న ఎలాజాక్షి, పైడినాయుడు, గంగరాజు, నందిని, దేవి, నూక రత్నం, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, అరుణ, రాజన్న, రాజమ్మ, ఎల్మాజీ, మాధవి,తదితరులు సుమా రు 100 మంది సీతంపేటలో గల జనసేనపార్టీ నగర కార్యాలయం నందు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు,వారందరికీ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు పార్టీ కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు,ఈ సందర్భంగా కొల్లి సింహాచలం మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ గారి చేసే అభివృద్ధి పనుల కు, సేవ కార్యక్రమాలకు, స్వచ్ఛందంగా 39వార్డ్ కు చెందిన వివిధ ఏరియాలలో నుండి వైస్సార్సీ పీ నాయకులు జనసేనపార్టీ లో జాయిన్ అయ్యారన్నారు, అనంతరం ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ పార్టీలో జాయిన్ అయిన వారందరికి ధన్యవాదములు తెలియచేసారు, భవిష్యత్తు లో దక్షిణ నియోజకవర్గం లో మరిన్ని అభివృద్ధి పనులు, సేవ కార్యక్రమాలకు చెప్పడ తాము అని అన్నారు, భవిష్యత్తు లో సౌత్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గం గా తీర్చిదిద్దుతానన్నారు,

ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ సౌత్ ఇంచార్జి శివప్రసాద్ రెడ్డి, 39 వార్డ్ కార్పొరేటర్ షాది క్,39 వార్డ్ జనసేన వార్డ్ అధ్యక్షులు తాతారా వు,43 వార్డ్ కార్పొరేటర్ ఉషశ్రీ, 39 వార్డ్ జనసేన నాయకులు ప్రణీత్, మరియు 39 వ వార్డుకు చెందిన జనసైనికులు, వీరామహిళలు పాల్గొన్నారు.

## కె.కృష్ణప్రసన్నకు ఐపీఎస్ హెూదా కల్పన



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, జులై 16** :రాష్ట్రంలో 2010వ సంవత్సరం బ్యాచ్ కు చెందిన గ్రూప్ 1 అధికారిని కె.కృష్ణప్రసన్నకు ఐపీఎస్ హెూదా లభించింది. రాష్ట్రంలో గ్రూప్ 1 ద్వారా ఎన్నికైన 14మంది నాన్ క్యాడర్ ఎస్పీ లకు ఐపీఎస్ హెూదా ఇచ్చేందుకు యూపీఎస్సీ నిర్ణయించింది. ఈ విషయమై రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, చీఫ్ సెక్రటరీ విజయా నంద్, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం యూపీఎస్సీ, డిఓపిటి అధికారులతో అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన 14మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు ఐపీఎస్ హెూదా ఇచ్చేందుకు ఆమోదించారు. వీరిలో ప్రస్తుతం విజయవాడ సీఐడి సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ గా పనిచేస్తున్న కె.కృష్ణ ప్రసన్నకు ఐపీఎస్ హెూదా లభించింది.

## గిరిజన గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు.





**గుమ్మలక్ష్మీపురం జులై 16, పెన్ పవర్.** జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 15 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు మండలం లో గల దుడ్డుఖల్లు మరియు వనకాబడి పంచాయతీ పరిధిలోగల దొరజమ్ము, బొడ్లగూడ,తుమ్మిగూడ గ్రామాలలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఆయా పంచాయతీ కార్యదర్శులు మరియు సర్పంచ్ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా గ్రామంలో వున్న చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తీయడం,వీధి కాలువలు శుభ్రం చెయ్యటం,వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయడం,తదితర శానిటేషన్ కార్యక్రమాలు చేపలతో గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత గూర్చి క్లుప్తంగా వివరిస్తూ అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దుడ్డుఖల్లు పంచాయితీ సిబ్బంది:-గ్రామ సర్పంచ్ :-నిమ్మక.నీలావతి, పంచాయతీ కార్యదర్శి:-రామకృష్ణ,బిజెపి.ఎస్.టి మోర్చా జిల్లా అధ్యక్షులు :- నిమ్మక సింహాచలం,వార్డ్ మెంబర్:- జి.నాగేశ్వరరావు. మరియు వనకాబడి పంచాయతీ సిబ్బంది,ఇంజనీరింగ్ అసిస్టెంట్ :-ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ :-భాస్కర్, వెటర్నరీ అసిస్టెంట్ :-బి.వెంకటేష్ డిజిటల్ అసిస్టెంట్ :- ఎస్.రమేష్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అసిస్టెంట్ :- పి.భావన,దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెచ్.వి :-పెంటమ్మ,ఏ.ఎన్. ఎం. :- ఏ.గీత.మరియు ఆశా వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బృహత్ ప్రణాళిక పై సలహాలు, సూచనల స్వీకరణకి అనూహ్య స్పందన




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జులై 16** :వి ఎం ఆర్ డి ఎ రూపొందించిన బృహత్ ప్రణా ళిక -2041 పై సలహాలు సూచనల స్వీకరణ కి అనూహ్య స్పందన లభించింది. బుధవారం ఉద యం వి ఎం ఆర్ డి ఎ కార్యాలయంలో మూడవ అంతస్తు సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ కె ఎస్ విశ్వనాథన్, స్వయంగా వినతులు స్వీకరించారు. నగర ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు ,వంశీ కృష్ణ శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతి రాజు యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జీవీఎంసీ కార్పొరేటర్లు ఎస్.పద్మా రెడ్డి, స్టాలిన్ తదితరు లు పాల్గొని తమ పరిధిలోని, తమ దృష్టికి వచ్చి న మాస్టర్ ప్లాన్ కు సంబంధించి పలు సూచన లు చేశారు. మాస్టర్ ప్లాన్ లోని లోపాలను సరిచేయాలని సూచిస్తూ వినతులు అందజేశా రు. వీరితో పాటు వి ఎం ఆర్ డి ఎ పరిధిలోని ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులు, పలు రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొని వినతులు అందజేశారు. వినతులను పరిశీలించి, పరిష్కా రానికి తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ , కమిషనర్ కె ఎస్ విశ్వనాథన్ తెలిపారు. వచ్చిన ముఖ్యమైన వినతులు రుషికొండ సర్వే నెంబర్ 25లో %ూ%1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ప్రతిపాదిత 60 మీటర్ల రహదారిని విభాగిని నుండి ఇరువైపులా 30 మీటర్లు ఉండేవిధంగా మాత్రమే అలైన్మెంట్ ఉండాలని స్థానిక స్థల యజమానులు కోరారు.

దసపల్లా హిల్స్ సర్వే నెంబర్ 1196 లో నౌరోజీ రోడ్ నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డు కి కలిపే రహ దారి విస్తరణ ప్రస్తుతం నిలిపివేయాలని దసప ల్లా హిల్స్ లే అవుట్ స్థలాల యజమానులు కోరారు నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి నిర్మాణం వద్దని స్థానిక రైతు లు మరియు గ్రామస్తులు కోరారు.నేరేళ్ళ వలస రెవెన్యూ గ్రామంలో ఎస్ ఓ ఎస్ వద్ద ప్రతిపాది త 70 మీటర్ల రహదారి అలైన్మెంట్ను మార్పు చేయాలని స్థానిక మధ్యతరగతి స్థల యజమా నులు కోరారు. సర్వే నెంబర్337/407 మధుర వాడ గ్రామంలో రామానాయుడు స్టూడియో దరి జర్నలిస్టుల లే అవుట్ మీదుగా ప్రతిపాదిం చిన 18 మీటర్ల రహదారిని తొలగించాలని సంఘ ప్రతినిధులు కోరారు సర్వే నెంబర్ 101(రుషికొండ) లో 33 అడుగుల ప్రతిపాదిత గ్రీన్ బెల్ట్ ను తొలగించాలని ఎన్నారై వ్యాపార వేత్త విజ్ఞప్తి.మధురవాడ సర్వే నెంబర్ 374/1 , ఎల్ పి నెంబర్ 74/88 లో ప్రతిపాదిత 60 అడుగు లు రహదారి స్థానే 40 అడుగుల రహదారిని కొనసాగించాలని స్థానికులు వినతి, హనుమం తువాక నుంచి జోడుగుళ్లపాలెం వరకు ప్రతిపా దిత 100 అడుగుల రహదారిని 60 అడుగుల కు పరిమితం చేయాలని స్థానిక గృహ యజమా నులు కోరారు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి రైల్వే న్యూ కాలని వరకు గల ప్రతిపాదిత 100 అడుగుల రహదారి నీ 60 అడుగులకు పరిమితం చేయాలని పలువురు స్థానిక వ్యాపా రులు నుంచి వినతి.సర్వే నెంబర్ 76/5 గుడిలో వ పరిధిని ఎకో జోన్ నుంచి నివాస జోన్ గా మార్పు చేయాలని స్థానికుల నుంచి విన్నపం లంకలపాలెం నుంచి షీలా నగర్ వరకు ప్రతిపా దించిన 80 మీ రహదారి స్థానే 60 మీ రహదా రిని కొనసాగించాలని జీవీఎంసీ కార్పొరేటర్ స్టాలిన్ గారు వినతి పత్రం సమర్పిం చారు. స్థానిక భూలోకమాత ఆలయం వద్ద రహదారి విస్తరణ ప్రతిపాదనను విరమించు కోవాలని గ్రామ ప్రజలతో కలిసి జీవీఎంసీ కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి విజ్ఞప్తి చేసేరు. విజయనగరం, వీ.టి అగ్రహారం ఎస్ నెంబర్ 115,116 గుండా ప్రతిపాదించిన 60 అడుగుల రహదారి తొలగించాలని స్థానికులు విన్నవిం చుకున్నారు. మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ ప్రక్కన ప్రస్తుతమున్న 60 అడుగుల రహదారిని 100 అడుగుల వెడల్పు రహదారిగా చేసిన ప్రతిపాదనలను పునః పరిశీలించాలని స్థానిక పోతినమల్లయ్యపాలెం గృహ యజమా నుల నుంచి విజ్ఞప్తి.వేపగుంట , పినగాడి రహదా రిని నిర్మించేందుకు సత్వరమే వేగవంతమైన చర్యలు తీసుకున్న నేపథ్యంలో చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ని, కమిషనర్ కె ఎస్ విశ్వనాథ న్ ని గ్రామస్తులు, మాజీ సర్పంచ్ బైలపూడి జయరామ్ , గ్రామస్తులు అభినందిం చారు.

## ఐటీడీఏ వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇవ్వాలి




రైతులకు ప్రభుత్వము సబ్సిడీ ఇవ్వక ప్రైవేటు షాపులు పై చూపు

**చింతపల్లి పెన్ పవర్ జులై 16** :-వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వము సబ్సిడీతో ఇవ్వకపోవడంతో ప్రైవేట్ షాపుల నుంచి ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్న గిరి రైతులు. గిరిజన ప్రాంతంలో ప్రతి సంవత్సరం వ్యవసాయ పనిముట్లు గిరి రైతులకు సబ్సిడీతో ఇస్తామని ఆశలు చూపించడం తప్ప ఇచ్చేది కనిపించడం లేదని పలువురు గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇస్తామని చెప్పి మోసం చేశారు తప్ప ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కూటమి ప్రభుత్వంలో అయినా ఇస్తారని ఎన్నో ఆశలతో ఎదురు చూశామని పలువురి రైతులు చెప్పారు. ఈ మధ్యకాలంలో పాడేరు ఐటీడీఏ జిల్లా కలెక్టర్ ప్రకటనలు కూడా చేశారని ఇప్పుడు కూడా ఆశలు

నిరాశలు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయని. ఈ సీజన్ లో ఇవ్వకపోతే ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చే సూచనలు కనిపించక పోవడంతో ప్రైవేట్ షాపుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి అప్పులు చేసి తీసుకోవలసి వస్తుందని గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం పనిముట్లు టిల్లర్లు ఎక్కువ మంది గిరి రైతు కొనుగోలుచేస్తున్నారని ప్రభుత్వము ఐటిడిఏ తక్షణమే స్పందించి సబ్సిడీతో రైతులకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటన



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అనకాపల్లి జులై 16** :జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ గురువారం అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం మ ధ్యాహ్నం 3. 00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కమిషన్ స భ్యులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు జిల్లాలో షెడ్యూల్డ్ కులాల జనాభా స్థితిగతు లు,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ల బ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వస తుల పరిస్థితి, ప్రభుత్వపరంగా వారికి కల్పించి న సౌకర్యాలు,తీసుకుంటున్న చర్యలు తదిత ర అంశాలపై అధికారులతో కమిషన్ సభ్యులు వ డ్డేపల్లి రాంచందర్ సమీక్ష నిర్వహించనున్నారు.

## ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీ చెయ్యాలి-సిపిఎం




**అరకులోయ పెన్ పవర్ 16:**శిశు మరణాలు తగ్గించాలనీ, గిరిజన సంఘం నాయకులు బుధవారం అరకులోయ మండల కేంద్రం ఆదివాసి గిరిజన సంఘం భవనంలో పాత్రికేయుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.గన్నెల, సుంకరమెట్ట, మాడగడ పి హెచ్ సి లో రిటైర్మెంట్ అయిన ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలనీ, ఓం డెలివరీ శిశు మరణాలు తగ్గించాలనీ సిపిఎం డిమాండ్. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ అరకులోయ మండలంలో గన్నెల ,సుంకరమెట్ట, మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అనేకమంది ఆశ కార్యకర్తలుగా పనిచేసి పదవీ విరమణ పొందేరు. ఆ స్థానంలో ఆశ కార్యకర్తలను భర్తీ చేయుటకు ఈ మధ్యకాలంలో జారీచేసిన నోటిఫికేషన్ లో ఖాళీలను చూపించలేదనీ. గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బైరేడువలస, దుంబ్రిగూడ తాంగులబెడ్డ, దాబు గుడ .సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాం పరిధిలో కె బెడ్డ గుడ, కిన్నం గుడ, దౌడ గుడ ,బోయిగూడ. మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గెమ్మెలి వలస, బుద్య వలస గ్రామాలకు ఆశ కార్యకర్తలుగా పని చేసిన వారు రిటైర్మెంట్ అయ్యారు. ఆ స్థానంలో ఆశ కార్యకర్తలు భర్తీ చేయవలసి ఉన్నప్పటికీ 300 మంది జనాభా ఉండాలని ప్రభుత్వ నిబంధనలు పేరుతో ఆశ కార్యకర్తలు భర్తీ కావడం లేదనీ, ప్రభుత్వ నిబంధనాలతో గిరిజన ప్రాంతంలో వైద్యానికి దూరమవుతున్నారు. గిరిజన ప్రాంతంలో ఆశ కార్యకర్తలు ఎంతో సేవ భావంతో పని చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో రవాణా మార్గం సక్రమంగా లేని పరిస్థితుల్లో ఆశ కార్యకర్తలు తమ సొంత గ్రామాల్లో ఉండి అనారోగ్యం పాలైన వారికి ఆసుపత్రిలో చేర్పించే వరకు దగ్గరుండి పనిచేస్తున్నారు .శిశు మరణాలు హెూమ్ డెలివరీ వంటి సమస్యలు పరిష్కారానికి రాత్రి పగలు పనిచేస్తున్నారు. సేవలు అందించే ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. తొలి అడుగు పేరుతో ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో గిరిజనులకు నట్టేట ముంచే కార్యక్రమాన్ని శ్రీకారం చుడుతున్నారు. ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీ చేయకపోవడం గిరిజనులకు వైద్యం అందకుండా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కర్తవ్యంగా ఏజెన్సీలో కనిపిస్తుందనీ. రిటైర్మెంట్ అయిన ఆశ కార్యకర్తల స్థానంలో భర్తీ చేయుటకు నోటిఫికేషన్ లేకుండా చేసింది. ఆశ కార్యకర్తల భర్తీ నోటిఫికేషన్ జారీ చేసి నా విషయం తెలిసింది. అరకు మండలంలో మూడు పీహెచ్ సి పరిధిలో ఖాళీగా ఉన్న ఆశ పోస్టులో అందులో కొన్ని గ్రామాలు మాత్రమే ఈ నోటిఫికేషన్ లో ప్రకటించి ఉన్నారు. దీనివలన గిరిజన నిరుపేదలకు వైద్యం అందకుండా నిర్లక్ష్యని గురి అయ్యే అవకాశం ఉందనీ,ఖాళీగా ఆశ భర్తీ చేయకపోతే భవిష్యత్తులో ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు.ఈ పత్రికసమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గెమ్మెలి చిన్నబాబు మండల నాయకులు కొర్రా మగ్గన్న కిల్లో జగనాదం, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మెగా ప్లాంటేషన్.




**అరకులోయ పెన్ పవర్ 16:** అరకులోయ మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాలీ జాతీయ సేవా పథకం బోటనీ శాస్త్రా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మెగా ప్లాంటేషన్ మొక్కలు నాటే ప్రక్రియ మెగా ప్లాంటేషన్ నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థులు కలిసి 50 జంబో నేరేడు మొక్కలు 10 పూల జాతి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధాని మోడీ గ పిలుపుమేరకు తల్లి పేరుతో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి పాటుపడాలన్నారు. ఎన్ఎస్ఎస్ పి ఓ లు పి నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి, బోటనీ అధ్యాపకులు బి లచ్చన్న మాట్లాడుతూ గ్రామాల్లో సైతం విద్యార్థులు తల్లి పేరుతో మొక్క నాటే భాగస్వాములై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్.కోట కు చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియె)వ్యవస్థాపకులు బి. రామకృష్ణ మొక్కలను అందించిన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి కొండబాబు అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్, ఎస్.రాజు, ఎస్ సోంబాబు, ఎస్. అప్పారావు విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎస్.ఎన్.ఎల్ టవర్ ఉన్న- సిగ్నల్స్ మాత్రం నున్న.

**గుమ్మలక్ష్మీపురం జులై 16.పెన్ పవర్.**



గుమ్మలక్ష్మీపురం మండలం,రేగిడి, దుడ్డుఖల్లు గ్రామంలో నిర్మించిన బి.ఎస్.ఎన్.ఎల్ టవర్,సిగ్నల్స్ లేక బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగావి నియోగదారులు మాటాడుతు.సుమారుగా మూడునెలలు కావస్తున్నప్పటికీ బి.ఎస్.ఎన్.ఎల్ సిగ్నల్స్ లేక నెట్వర్క్ అందక ఫోన్ కాల్స్ మరియు ఆన్లైన్ సేవలకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు మరియు ఉద్యోగస్తులకు చాలా ఇబ్బంది కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.అంతేకాకుండా దుడ్డుకలు,రేగిడి పంచాయతీ సచివాలయం కేంద్రాలు ఉన్నప్పటికీ,సరైన నెట్వర్క్ లేక ప్రజలకు కావలసినటువంటి కొన్ని ముఖ్యమైన ఆన్లైన్ సేవలకు కూడా ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఏర్పడుతుందని వినియోగదారులు వ్యక్తం చేశారు.అందువలన సంబంధిత బి.ఎస్.ఎన్.ఎల్ ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిగ్నల్స్ ఇచ్చే ఏర్పాట్లకు చర్యలు తీసుకుని బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారులకు మరియు ప్రజలకు,నెట్వర్క్ అంతరాయం కలగకుండా సహకరించగలరని ఈ పత్రిక మూలంగా తెలియజేయడం జరుగుతుందని వారు అన్నారు.

## 89వ వార్డులో రోడ్డు ప్రక్క షాపులను తొలగించిన జీవీఎంసీ అధికారులు





**గోపాలపట్నం, పెన్ పవర్, జూలై 16 :** విశాఖ, పశ్చిమ నియోజకవర్గం, 89వ వార్డులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రోడ్డు పక్క నిర్మించిన షాపులను జీవీఎంసీ అధికారులు తొలగించారు. షాపుల తొలగింపుపై యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ షాపులను ఎలా తొలగిస్తున్నారంటూ బాధితులు జీవీఎంసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను భారీగా మోహరించారు. జీవీఎంసీ, రోడ్డు పక్క షాపులను ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి మరియు రోడ్లపై ఆక్రమణలను నియంత్రించడానికి ఈ చర్య తీసుకున్నారు. ముఖ్యంగా కొత్తపాలెం కూడలి నుంచి నరవ వెళ్లే రోడ్డు ఇరుపక్కల షాపులను తొలగించి, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి, నియంత్రించడానికి ఈ చర్య తీసుకున్నారని జీవీఎంసీ అధికారులు తెలిపారు. రోడ్లను ఆక్రమించి షాపులను పెట్టడం వలన ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. అందువలన వ్యాపారులు రోడ్డు స్థలాలను కూడా ఆక్రమించి అద్దెకు ఇస్తున్నారని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని తెలిపారు. ఈ తొలగింపుల్లో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ టిపిఓ గోపన్న, వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు సాహితీ, కళ్యాణి, తరుణ్, శ్రీనివాస్ మరియు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, స్టేషన్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం,

- జూలై 23న 4వ జోన్ లో బహిరంగ వేలం నిర్వహణ.

**విశాఖ దక్షిణం ,పెన్ పవర్, జూలై 16 :**మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4వ జోన్ లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్, మెయిన్ ఆఫీ కాంటీన్ నకు జూలై 23వ తేది ఉ.గం.11. 00 లకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగునని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్. మల్లయ్య నాయుడు బుధవారం పత్రికా ప్రకట న ద్వారా తెలిపారు.జివిఎంసి 4వ జోన్ (సూర్యబాగ్) పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయము, జగదాంబ వాణిజ్య సముదాయము, పాత బస్ స్టాండ్ దుకాణాము లు, పద్మనగర్ వాణిజ్య సముదాయము, సూ ర్యబాగ్ వాణిజ్య సముదాయము, టి.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయము, అంగడిదిబ్బ వాణి జ్య సముదాయము లలోని మిగిలిన దుకా ణాలకు మరియు జివిఎంసి మెయిన్ ఆఫీస్ కాంటీన్, అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లివీ ధి రోడ్ సైడ్ ఫిష్ మార్కెట్లును 3 సంవత్సరము ల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు 23-07-2025 తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమి షనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొ నదలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్లు తెలిపారు.

## ఏడాది పాలనలో నే కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది

- కూటమి పాలనలో అభివృద్ధికి అగ్రాసనం
- సుపరిపాలన ప్రచారంలో భీమిలి ఎమ్మెల్యే గంటా





**పద్మనాభం, పెన్ పవర్ జూలై 16 :**వైసీపీ హయాంలో అభివృద్ధి పరంగా అట్టడుగు స్థాయికి దిగజారిన రాష్ట్రాన్ని ఏడాది పాలనలో నే కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బుధ వారం పద్మనాభం మండలం రేవిడిలో ఇంటిం టికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ కంపెనీలు క్యూ కడుతు న్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబా బు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ చొరవ కారణంగా విశాఖలో టీసీఎస్.. గూగుల్.. కాంగ్నిజెంట్.. సత్వా.. వంటి కంపెనీలు ఏర్పాటు కానున్నాయ న్నారు. అలాగే వైసీపీని మించి సంక్షేమాన్ని అమలు చేస్తూ.. ప్రజల మన్ననలు పొందామని తెలిపారు. 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వ గా,అంతకంటే 60 శాతం ఎక్కువగా 67 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తున్నామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ లు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు తీరును వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో రామాలయం ఉత్సవాల్లో పాల్గొని, అన్నసంతర్పణ జరిపారు. కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. ఎం.విజయ్ కుమార్, కూటమి నాయకులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదర రావు, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, మజ్జి నందీశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, పాంద్రంగి రామరాజు, బి.ఆర్.బి. నాయుడు, చందక అప్పలరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





**ఎలమంచిలి, పెన్ పవర్, జూలై 16 :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వార్షిక తనిఖీల్లో భాగంగా ఎలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ ను ఈ రోజు తనిఖీ చేశారు. స్టేషన్ కు వచ్చిన ఎస్పీని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ధనుంజయరావు, ఎస్సై కె.సావిత్రి మొక్కలు అందిస్తూ స్వాగతం పలికారు. తదుపరి, ఎస్పీ
పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల ప్రస్తుత దర్యాప్తు స్థాయిని తెలుసుకున్నారు. గ్రేవ్/నాన్-గ్రేవ్ కేసుల నమోదు నుండి కోర్టు డిస్పోజల్ వరకు ఫైళ్ళను విస్తృతంగా పరిశీలించారు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన కేసుల్లో ట్రయల్ త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాల పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు/డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని, ప్రజల్లో అవగాహన పెంచి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రోత్సహించాలని సూచించారు. సిసిటిఎన్ఎస్ లో ఎఫ్ఐఆర్ నుండి కోర్టు డిస్పోజల్ వరకు ప్రతి కేసును అప్డేట్ చేయాలని ఆదేశించారు. రోడ్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ పై కేసులు నమోదు చేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ, మహిళలకు భరోసా కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయిలో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మమేకమై ప్రతి ఒక్కరు నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి అని సూచించారు. గ్రామాల్లో అనుమానితుల కదలికలను సేకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సిబ్బందిలో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో ఎలమంచిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ధనుంజయ రావు, ఎలమంచిలి టౌన్ ఎస్సై కె.సావిత్రి, ట్రాఫిక్ ఎస్సై బి.రామకృష్ణ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు



- నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణ
- ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- విశాఖ, భీమిలి డివిజన్ల రెవెన్యూ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్టణం, జూలై 16 :**అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నెం.30 తాలూక ఉద్దేశాలను, ఆవశ్యకతలను ప్రజలకు తెలియపరచాలని, పూర్తి సహకారం అందించాలని సూచించారు. జీవో ప్రకారం 15.10.2019 తేదీకి ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. సచివాలయాల వారీగా జాబితాలను ప్రచు రించాలని సూచించారు. బుధవారం మధ్యా హ్నం కలెక్టరేట్ మీటింగు హాలులో వేర్వేరుగా జరిగిన విశాఖపట్టణం, భీమిలి రెవెన్యూ డివి జన్ల కాన్ఫరెన్స్ లలో పలు అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పీజీఆర్ఎస్ వేదికగా వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలని, వివిధ సమస్యల పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే సామాన్యుల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించాలని, సత్వర సేవలంది స్తూ అండగా నిలవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలపై సానుకూల వైఖరి వచ్చేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో సేవలందించా లన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజతో మర్యా దగా ఉండాలని, వారి సంతృప్తే కొలమానంగా రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తా మని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా పని చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలని, ఆక్రమణల తాలూక వివరాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని, కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా ప్రతి అధికారీ పని చేయాలని, ప్రజా సేవలో మరింత నాణ్యత కనిపించేలా వ్యవహరించాలని పేర్కొన్నారు.
జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాథుర్, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, కలెక్టరేట్ ఏవో ఈశ్వర రావు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెం డెంట్లు, తహశీల్దార్లు, డీటీలు, మండల సర్వేయ ర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్రింది స్థాయి పోలీసు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకై వైద్య పరీక్షలు

**పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసేందుకే హెల్త్ చెక్ అప్స్**

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,**

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం జూలై 16 :** పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగులు, హెూంగార్డు ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూలై 16న తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడు తూ - జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది. హెూంగార్డు మరియు ఇతర ఉద్యోగులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోక పోవడం వలన వారిలో ఆరోగ్య సమస్యలను గుర్తించక అర్ధంతరంగా అస్వస్థతతకు గురికావడం, మృతి చెందడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య మరింత తీవ్ర రూపందాల్చిన కార ణంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులు చిన్న వయస్సులోనే అర్ధాంతరంగా మృత్యువాత పడ్డారన్నారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా పోలీసు శాఖలో పని చేస్తున్న పైస్థాయి అధికారుల నుండి హెూంగార్డు వరకు, మినిస్టీరియల్ సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసర మైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడు తున్నామన్నారు. పోలీసు ఉద్యోగుల వైద్య పరీక్షల రిపోర్టులను కూడా డిజిటలైజ్ చేసి, భద్రపర్చి, ప్రతీ ఏడాది వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి, వారి ఆరోగ్యంపై అప్రమత్తం చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది కూడా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో చేసుకోవాలని, డాక్టర్లు సూచించిన సలహాలను పాటించాలని, తినే ఆహారంలో మార్పులు చేసుకోవాలని పోలీసు ఉద్యోగులకు జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసు సిబ్బందికి ఫాస్టింగ్ సుగర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్), సీరం క్రియేట్ (కిడ్నీ), ఈ.సి.జి. వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిం చి, రిపోర్టులను పరిశీలించి, ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగుల కు తదుపరి చికిత్స అందించ డంతోపాటు, వైద్యపరమైన సలహాలను, సూచ నలను అందించడానికి ఒక ప్రత్యేక వైద్యుడిని కూడా నియమించానున్నారు. జిల్లా పోలీసుశా ఖలో పని చేస్తున్న మమారు 2000 నుండి పోలీసు సిబ్బందికి ఈ మాసాంతరంలోగా వైద్య పరీక్షలు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిం చానుని, పోలీసు ఉద్యోగులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. పోలీసు ఉద్యోగుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలోని మెడికవర్, స్కాన్యూ టేజ్లోను, బొబ్బిలిలోని క్వీన్ ఎన్.ఆర్.ఐ., రాజాంలోని జి. ఎం. ఆర్. వరలక్ష్మి కేర్ ఆసుపత్రిలో పరీక్షలు



నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఎఆర్) జి.నాగేశ్వరరావు, తిరుమల మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అఖిల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజేష్, విజయనగరం స్కాన్యు ఎండి వి.గోవర్ధన్, మేనేజర్ సిరి కృష్ణ మరియు ఆసుపత్రి సిబ్బంది, ఎఆర్ డిఎస్పీ వై.రవీంద్ర రెడ్డి, ఎస్బి సిఐ ఎ.వి. లీలారావు, ఆర్ఐలు ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు,మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జులై 16 :**ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ ఆదేశాలతో ఈగల్ బృందం విజయనగరం జిల్లాలో యువ త, విద్యార్థులకు మత్తు, మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కల్పించి, అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. విజయనగరం పట్టణం తోటపాలెంలోని ఏజీయల్ జూనియల్ కళాశాలలో జులై 5న అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఈగల్ టీమ్ హెచ్సి విజయకుమార్ మాట్లాడుతూ - యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువు, లక్ష్యంపై దృష్టి పెట్టాలని కోరారు. చెడు సహవాసాలతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్ద ని, మత్తు, మాద క ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపు నిచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తుల, వ్యాపారు ల, వినియోగించే వారి సమాచారంను టోల్ ఫ్రీ నంబరు 1972 కు అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఈగల్ టీమ్ హెచ్సి విజయ కుమార్, కోటేశ్వరరావు, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# పిఠాపురం వర్మ ఇన్ బిగ్ ట్రబుల్స్!




**హైదరాబాద్ పెన్ పవర్:** పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అంటూ పవన్ గెలిచిన కొత్తల్లో ఒక్కటే హంగామా చేశారు. అలా పిఠాపురం లాంటి ఒక సాధారణ అసెంబ్లీ నియోజకవర్గం స్టేట్ వైడ్ ఫ్యామస్ అయిపోయింది. పిఠాపురంలో ఎవరు ఎమ్మెల్యే ఏమిటి అక్కడ రాజకీయం అన్నది 2024 ముందు దాకా జనాలకు పెద్దగా తెలిసేది కాదు. అంత కూలెస్ట్ అండ్ పీస్ ఫుల్ నియోజకవర్గంగా ఉండేది.అయితే అక్కడ నుంచి పోటీ చేసింది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. దాంతో పిఠాపురం సైతం కలర్ ఫుల్ గా మారిపోయింది. పొలిటికల్ గా ఎపుడూ హాట్ హాట్ టాపిక్స్ తో ఉంటోంది. అలాంటి పిఠాపురంలో టీడీపీకి రాజు లాంటి మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు. ఆయన 2024లో ఎమ్మెల్యే కావాలి. కానీ రాలేదు. దానికి కారణం కూటమి పొత్తులు రాజకీయాలు. ఇలా అన్నీ కలసి వర్మను సైడ్ బెంచ్ కి నెట్టేశాయి.పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ఎమ్మెల్సీ దక్కిందా అంటే అదీ కూడా లేదు. ఇక ఎమ్మెల్సీ తప్ప వేరే వరం కోరుకోమని టీడీపీ అధినాయకత్వం వర్మకు స్పష్టంగానే చెప్పింది అని అంటున్నారు. దాంతో మరింతగా పిఠాపురం వర్మ డీలా పడిపోయారని అంటున్నారు. ఇక ఎప్పటికీ చట్ట సభకు వెళ్ళడం అన్నది జరిగే విషయం కాదా అని ఆయన అనుచరులు కూడా తెగ ఫీల్ అవుతున్నారని భోగట్టాలు ప్రచారాలు సాగుతూండేవి.అయితే వాటిలో నిజం ఉందని ఏకంగా కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాట్ కామెంట్స్ చేశారు. వర్మ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నారని కూడా కుండబద్దలు కొట్టేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని బతికించుకోవాలని జ్యోతుల నవీన్ సూచించడం విశేషం. అంతే కాదు కొద్ది రోజులు ఆలస్యం అయినా వర్మకు సముచిత స్థానం ఇచ్చేందుకు అధినాయకత్వం సిద్ధంగా ఉందని జ్యోతుల నవీన్ చెప్పారు. ఇదంతా జరగాలీ అంటే టీడీపీ క్యాడర్ ఎవరూ ప్రలోభాలకు లొంగకూడదని ఆయన చెప్పుకొచ్చారు.సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో పిఠాపురంలో నిర్వహించిన సభలో జ్యోతుల నవీన్ చేసిన ఈ కామెంట్స్ ఇపుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయ్యాయి. వర్మ ఇబ్బందులు ఏమిటో నవీన్ చెప్పకపోయినా అందరికీ తెలిసిందే అని అంటున్నారు. అక్కడ జనసేన పాతుకుని పోవాలని చూస్తోంది. జనసేన బలపడాలి అంటే వర్మ జోరు తగ్గించాలని అంటున్నారు.అందుకే ఆయనకు పెద్ద పదవులు రావడం లేదు అన్నది ఆయన అభిమానుల అనుచరుల మాటగా ఉంది. అయితే జ్యోతుల నెహ్రూ ఈ విషయం ఏకంగా బహిరంగంగా చెప్పడం విశేషం. ఏ పార్టీలో అయినా అసంతృప్తి ఉంటుంది. నేతలు తమకు చాన్స్ రానపుడు నిరాశలో ఉంటరు. అయితే దాని మీద ప్రచారాలు చేస్తూ మీడియాలో వార్తా కథనాలు వస్తాయి. అబ్బే అలాంటిది లేదు అని చెప్పాల్సిన బాధ్యత పార్టీ నేతలది. కానీ మా వర్మ ఇబ్బందుల్లో ఉన్నారని ఏకంగా జిల్లా పార్టీ ప్రెసిడెంటే చెప్పారూ అంటే ఆ అసంతృప్తి చాలా పెద్దదే అని అనుకోవాలి.అంతకంటే ముందు పిఠాపురంలో టీడీపీ వర్సెస్ జనసేనగా సాగుతున్న రాజకీయంలో ఇదొక భాగం అనుకోవాలి. ఏది ఏమైనా వర్మ బిగ్ ట్రబుల్స్ నుంచి ఎపుడు బయటకు వస్తారు ఆయనకు ఇవ్వబోయే పదవి ఏమిటి, ఆయన ఆ పదవితో సంతృప్తి చెందుతారా ఇక పిఠాపురంలో జనసేన టీడీపీల మధ్య గ్యాప్ అనేది లేదు అన్న మాట వినిపిస్తుందా ఇవన్నీ ప్రశ్నలే జవాబుల కోసం వేచి చూడాల్సిందే.

# బాబు యాక్టింగ్ సూపరంటూనే జగన్ పుష్ప మేనరిజం!



**హైదరాబాద్ పెన్ పవర్:** నటన అంటే ఎన్టీఆర్ అందరికీ గుర్తుకు వస్తారు. అయితే ఎన్టీఆర్ నే నటనలో చంద్రబాబు మించిపోయారు అని వైసీపీ అధినేత జగన్ విమర్శలు చేశారు. బాబు యాక్టింగ్ దెబ్బకు దాన వీర శూర కర్ణ అయిన ఎన్టీఆర్ కూడా వెనక్కే అని సెటైర్లు పేల్చారు. బాబు నటనను అలా జగన్ వ్యంగ్యంగా మెచ్చేసుకున్నారన్న మాట.ఇక చూస్తే కనుక ఎన్టీఆర్ యాక్టింగ్ ఎక్కడో వెనక్కిపోతోందని అన్నారు. అలా లైవ్ లో జీవిస్తున్నారని కామెంట్స్ చేశారు. ఇదే సమయంలో జగన్ కూడా పుష్ప సినిమాలో హీరో మేనరిజం ని మీడియా ముందు ప్రదర్శించడం విశేషం.ప్రజలు మెచ్చేలా పాలన చేసి అప్పుడు ఇలా చేయ్ అంటూ గడ్డం కింద చేయి పెట్టి పుష్ప మాదిరి మేనరిజాన్ని జగన్ చూపించారు. అలా కాకుండా తమ ప్రభుత్వం మీద ఏదో అన్నారని ప్రతీ ఒక్కరినీ తీసుకుని వెళ్ళి కేసులు పెట్టి జైళ్ళలో వేయడమేంటి అని జగన్ ప్రశ్నించారు. ఇక జగన్ మరో మాట అన్నారు. సినిమా డైలాగులను పోస్టర్లలో పెడితే అరెస్టు చేసారా అని నిలదీశారు. ఆ డైలాగులు ఉన్న సినిమాలకు సెన్సార్ అనుమతులు ఇచ్చింది కదా అని లాజిక్ పాయింట్ ని లేవదీశారు. ఒకవేళ ఆ డైలాగ్స్ అభ్యంతరకరం అంటే వాటిని సినిమాలో నుంచి తీయించాలని ముందు సెన్సార్

వారిని అడగాలి కదా అని ప్రశ్నించారు.

అంతే కాదు బాలక్రిష్ణ పవన్ కళ్యాణ్ ల సినిమాల్లోనే ఇలాంటి డైలాగులు ఎక్కువగా ఉంటాయని ముందు ఆ డైలాగుల సంగతి చూడాలని జగన్ కోరడం విశేషం. ఈ ఇద్దరి హీరోల సినిమాలలో డైలాగులు దారుణంగా ఉంటాయని జగన్ విమర్శించారు. మరి సెన్సార్ బోర్డు అనుమతిస్తోంది కదా అంటూ మీ పోరాటం అక్కడ చేయండని సలహా ఇచ్చారు.

అంతే కాదు ఫ్యామస్ అయిన సినిమాలలో డైలాగులను పాటలను బయట అనుకరిస్తే తప్పు ఎలా అవుతుందో కూటమి పెద్దలు చెప్పాలని

జగన్ డిమాండ్ చేశారు. అవి అభ్యంతరకరమైన డైలాగులు అయినపుడు ఆ సినిమాలనే ఆపేయాలని కోరారు.మొత్తం మీద జగన్ తన మీడియా సమావేశంలో కాసేపు సినిమాల గురించి అందులో డైలాగుల గురించి కూడా మాట్లాడారు. అంతే కాదు బాలయ్య పవన్ సినిమాల మీద విమర్శలు చేస్తూనే చంద్రబాబుకు మహానటుడు అని బిరుదు ఇచ్చేశారు పనిలో పైగా పుష్ప మేనరిజంతో తాన నటనను సైతం మీడియాకు చూపించారు.ఇవన్నీ పక్కన పెడితే సినిమాల ప్రభావం రాజకీయ పార్టీల మీద ఎంత ఉందో తెలియదు కానీ వైసీపీ నేతల మీద బాగానే ఉంది అని అంటున్నారు. జగన్ అయితే పుష్ప మేనరిజాన్ని అసలు ఎక్కడా వదలడం లేదు అని గుర్తు చేసుకుంటున్నారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకు ఊరట.. అరెస్టు ముప్పు తప్పినట్లే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, విచారణ సమయంలో మహిళా నేతపై ఆయన చేసిన వ్యాఖ్యలను న్యాయస్థానం తప్పుపట్టింది. ఇక బుధవారం ఆ పిటిషన్ పై తీర్పు వెల్లడించిన హైకోర్టు నిందితుడికి బీఎన్ఎస్ లోని 35(3) ప్రకారం నోటీసులు జారీ చేసి విచారించాలని పోలీసులను ఆదేశించింది. దీంతో మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డిని అరెస్టు చేసే అవకాశాలు లేవని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.



వైసీపీకి చెందిన ప్రసన్నకుమార్ రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థి కోవూరు సిటింగ్ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై దారుణ వ్యాఖ్యలు చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రసన్నకుమార్ రెడ్డి నివాసంపై దాడి చేసి ధ్వంసం చేశారు. అయితే తన ఇంటిపై టీడీపీ కార్యకర్తలే దాడి చేశారని ఆరోపించిన ప్రసన్న తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోగా, రెండో రోజూ అవే వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. దీంతో ఆయనపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇక తనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జైలులో మాజీ మంత్రి కాకాణికి తోడుగా ఉంటానని ప్రకటించిన ప్రసన్న అరెస్టు భయంతో ముందస్తు బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టంచేసింది. పిటిషనర్ పై నమోదైన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడేవే కావడంతో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని ప్రసన్నకుమార్ రెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. అయితే వారి వాదనలతో విభేదించిన ప్రభుత్వ న్యాయవాదులు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, రెండో రోజు వాటిని సమర్థించుకున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసులు పెట్టిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడేవి కావడంతో ప్రసన్నకుమార్ రెడ్డిని బీఎన్ఎస్ లోని 35(3) ప్రకారం పిలిచి విచారించాలని ఆదేశాలిచ్చింది. ఇక విచారణలో ఆయన చెప్పే అంశాల ఆధారంగా అరెస్టు చేయాలా? వద్దా? అనే నిర్ణయాన్ని పోలీసులు తీసుకోనున్నారు. అయితే గతంలో ఉన్న మార్గదర్శకాల ప్రకారం ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు స్టేషను బెయిలు ఇచ్చే అవకాశం ఉంది. అయితే పోలీసులు ఈ నిబంధనను అనుసరిస్తారా? లేదా? అన్నదే ప్రస్తుతం చర్చనీయాంశం అవుతోంది. పోలీసుల తమ విచక్షణతో నిందితుడుని అరెస్టు చేసినా, మేజిస్ట్రేట్ కోర్టులో బెయిలు లభించే అవకాశం ఉందని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి అనుచితవ్యాఖ్యల కేసులో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న అరెస్టు అయ్యే పరిస్థితుల నుంచి తప్పించుకున్నారనే ప్రచారమే ఎక్కువగా జరుగుతోంది.

# యూఎస్ లో బిలియనీర్లు... ఇజ్రాయెల్, చైనాలను మించిన మనోళ్లు!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికన్ బిలియనీర్లలో వలసదారుల జాబితాను ఫోర్బ్స్ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాజాగా భారత సంతతికి చెందిన అమెరికా పౌరులు సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఇందులో భాగంగా... యూఎస్ లో నివసిస్తున్న విదేశీ బిలయనీర్లలో చైనా, ఇజ్రాయెల్ కంటే ఎక్కువమంది భారత్ నుంచి ఉండటం గమనార్హం.అవును... అమెరికాలో నివసిస్తున్న విదేశీ బిలియనీర్లలో ఇజ్రాయెల్, చైనా కంటే ఎక్కువ మంది భారత్ నుంచే ఉన్నారు. ఫోర్బ్స్ డేటా ప్రకారం.. ప్రస్తుతం 125 మంది విదేశీ సంతతి అమెరికన్ పౌరులు అక్కడి బిలియనీర్ల జాబితాలో ఉన్నారు. వీరంతా 43 దేశాల నుంచి వచ్చినవారు కాగా.. అమెరికాలో ఉన్న మొత్తం 900 మంది బిలియనీర్లలో వీరి వాటా 14శాతంగా ఉంది.అమెరికాలో మొత్తం బిలియనీర్ల సంపద 7.2 ట్రిలియన్ డాలర్లు కాగా... అక్కడున్న వలస బిలియనీర్ల మొత్తం సంపద 1.3 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అంటే ఇది 18శాతం వాటాకు సమానం. ఇక ఈ వలస బిలియనీర్లలో 2022లో ఇజ్రాయెల్, కెనడా, చైనా నుంచి వచ్చిన వారు 7గురు చొప్పున ఉండగా.. భారత్ నుంచి వచ్చినవారి సంఖ్య 7గానే ఉండేది.అయితే తాజాగా విడుదలైన జాబితాలో ఇజ్రాయెల్ (11), తైవాన్ (11), చైనా (8) మందితో ఉండగా.. భారత్ మాత్రం 12 మందితో మొదటి స్థానంలో ఉంది. వీరిలో జే చౌదరి (జెడ్ స్కేలర్ సీఈఓ) 17.9 బిలియన్ డాలర్ల సంపదతో ఉండగా.. వినోద్ ఖోస్లా (ఖోస్లా వెంచర్స్) 9.2 బిలియన్ డాలర్లతో ఉన్నారు.ఇదే సమయంలో... సుందర్ పిచాయ్ (గూగుల్ సీఈఓ) 1.1 బిలియన్ డాలర్లు, సత్యానాదెళ్ల (మైక్రోసాఫ్ట్) 1.1 బిలియన్ డాలర్లతో ఉన్నారు. ఇక అమెరికాలో అత్యంత ధనవంతుడైన వలసదారుడిగా ఎలాన్ మస్క్ కొనసాగుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచిన మస్క్ సంపద సుమారు 393 బిలియన్ డాలర్లు ఉంది.

**అమెరికాలో ఉన్న టాప్ 10 భారత బిలియనీర్ల జాబితా ఈ విధంగా ఉంది!:**

1. జే చౌదరి – $17.9 బిలియన్లు
2. వినోద్ ఖోస్లా – $9.2 బిలియన్లు
3. రాకేష్ గంగ్వాల్ – $6.6 బిలియన్లు
4. రొమేష్ టీ. వాద్వానీ – $5.0 బిలియన్లు
5. రాజీవ్ జైన్ – $4.8 బిలియన్లు
6. కవితార్క్ రాం – $3.0 బిలియన్లు
7. రాజ్ శర్దానా –$ 2.0 బిలియన్లు
8. డేవిడ్ పాల్ – $1.5 బిలియన్లు
9. నికేష్ అరోరా – $1.4 బిలియన్లు
10. సుందర్ పిచాయ్ – $1.1 బిలియన్లు

11 సత్య నాదెళ్ల – $1.1 బిలియన్లు

## రాహుల్ గాంధీకి పోస్ట్ ను అమిత్ మాలవీయ డిలీట్ చేయడం వెనుక అసలు కారణం ఇదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత సైన్యాన్ని అవమానించిన కేసులో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ సీనియర్ లీడర్ రాహుల్ గాంధీపై ఉత్తరప్రదేశ్ లోని లక్నో కోర్టులో కేసు నమోదైంది. అయితే ఈ కేసుకు సంబంధించి కోర్టు బుధవారం (జూలై 16) బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో ఓ వార్త దుమారం రేపింది. కానీ అది ఫేక్ అని నాలుక కరుచుకున్న నేత దాన్ని తన ట్విటర్ ఖాతా నుంచి డిలీట్ చేశాడు. ఇప్పుడు ఆ వార్త కంటే ఈ వార్తనే వైరల్ గా మారింది.రాజకీయ పరంగా, సైద్ధాంతికంగా పార్టీల మధ్య విభేదాలు ఉండవచ్చు. కానీ అవి ప్రజా ప్రయోజనం కోసమే ఉపయోగపడాలి. ప్రజలను పక్కదారి పట్టించేలా ఉండద్దు. రాజకీయ పార్టీల నాయకులు అప్పుడప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ట్వీట్లు, పోస్టులు ప్రజలను పక్కదారి పట్టించేలా ఉంటున్నాయి. ఆ పార్టీ, ఈ పార్టీ అని బేధం లేకుండా నాయకులు పోస్టులు పెడుతూ అభాసుపాలవుతుంటారు. అయితే అది చిన్నా చితకా.. గల్లీ లీడర్లు పెడితే పెద్దగా పట్టించుకోరు కానీ నేషనల్ లీడర్స్ పెడితే దేశ వ్యాప్తంగా చర్చకు వస్తుంది.బీజేపీ పార్టీకి చెందిన ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ట్విటర్ లో ఒక ఫొటో షేర్ చేశాడు. అది దేశ వ్యాప్తంగా వైరల్ గా మారి జనాల దృష్టిని ఆకర్షించింది. రాహుల్ గాంధీకి సంబంధించి పరువు నష్టం కేసులో బెయిల్ మంజూరైన తర్వాత మాలవీయ ఈ పోస్ట్ బయటకు వదిలారు. 'బెయిల్ మంజూరు చేసిన లక్నో కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అలోక్ వర్మతో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ'అని. అయితే మాలవీయ ఎలాంటి ఫ్యాక్ట్ చెక్ చేసుకోకుండా దీన్ని పోస్ట్ చేశారు. పైగా 'ఆయన న్యాయమూర్తి పదవి నుంచి తప్పుకోవాలని, ఆయన నిరాకరిస్తే ఫిర్యాదు దారులు హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని' పోస్ట్ లో పేర్కొన్నారు.కానీ అది తప్పుడు పోస్ట్ అని తెలిసి డిలీట్ చేశారు. సెల్ఫీలో ఉన్న వ్యక్తి న్యాయమూర్తి కాదని, ఆయన న్యాయవాది సయ్యద్ మహమూద్ హసన్ అని తెలిసింది. జిల్లా కోర్టు అధికారిక వెబ్ సైట్ ఫొటోలోని వ్యక్తి న్యాయమూర్తి కాదని ప్రకటించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటే, ఫ్యాక్ట్ చెకర్ అభిషేక్ కుమార్ ఆ ఫొటోలో ఉన్నది సయ్యద్ మహమూద్ హసన్ గా అంటూ మాలవీయ పోస్టుకు ట్యాగ్ చేశారు. దీంతో మలవీయ పోస్ట్ ను డిలీట్ చేశారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున దుమారమే లేపారు. 2022లో భారత్ జోడో యాత్ర చేస్తున్న సందర్భంలో ఆర్మీపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణకు సంబంధించి కేసుపై రాహుల్ లక్నో కోర్టుకు మంగళవారం (జూలై 15) వచ్చారు. రూ. 20వేల బాండ్లు, ఇద్దరు వ్యక్తుల పూచీకత్తుతో రాహుల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణను న్యాయమూర్తి ఆగస్ట్ 13కు వాయిదా వేశారు.

# నెక్స్ట్ పీఎం యోగీనా...అమిత్ షానా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం రెండు నెలలు మాత్రమే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వయసు 75 నిండుతాయి. సెప్టెంబర్ 17 కి ఆయన 76వ పడిలోకి ప్రవేశిస్తారు. అంటే ఇక్కడే ఇటీవలనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వార్తలు గుర్తుకు వస్తున్నాయి. ఏడున్నర పదుల వయసు నిండిన వారు రాజకీయాలకు దూరంగా ఉండాలంటూ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలే ఇటీవల చేశారు. ఆయన జనరల్ గా చేసినట్లు అనిపిస్తున్నా మోడీ 75 ఏళ్ళకు దగ్గరగా ఉండడంతో ఆయన మీదనే పరోక్షంగా వ్యాఖ్యలు చేశారా అన్న చర్చ సాగుతోంది. అంతే కాదు ఆర్ఎస్ఎస్ అంటేనే బీజేపీకి మార్గదర్శిగా ఉంటూ వస్తోంది. కాబట్టి ఎవరో కాదు ఏ పార్టీకో అంతకంటే కాదు బీజేపీకే అది కూడా మోడీకే సలహా ఇచ్చినట్లుగా ఉందని విశ్లేషణలు అయితే మొదలయ్యాయి.సరే బీజేపీకే మోడీకే ఈ కామెంట్స్ అని అనుకున్నపుడు మోడీ నిజంగా దానిని పాటించాలని అనుకున్నప్పుడు ఆయనే తప్పుకున్నపుడు బీజేపీలో మోడీ తర్వాత ప్రధానమంత్రి ఎవరు అన్నది మరో చర్చగా ఉంది. మోడీ తరువాత ప్రధాని పదవికి పోటీ పడే వారు ఎవరెవరు అంటే చాలా పేర్లు వినిపిస్తాయి.

అయితే బీజేపీది హిందూత్వ నినాదం. ఆర్ఎస్ఎస్ కూడా దానినే గట్టిగా ప్రచారం చేస్తూ ఉంటుంది. మరి ఆ వాదాన్ని ఏ రకమైన వివాదం లేకుండా జనంలోకి తీసుకుపోవడానికి ఒక పవర్ ఫుల్ ఇమేజ్ ఉన్న నాయకుడు కావాలి. ఒక వైపు నాయకుడిగా ఉంటూనే మరో వైపు బీజేపీ హిందూత్వను జనంలో పెట్టి ఆకట్టుకునే ఘన నేత ఎవరు అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు.అలా చూస్తే కనుక ఆర్ఎస్ఎస్ మదిలో మెదిలే ఒకే ఒక్క పేరు యోగి ఆదిత్యనాథ్ అని అంటున్నారు. ఆయన 2017లో ఉత్తరప్రదేశ్ లాంటి అతి పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. గత ఎనిమిది ఏళ్ళుగా ఆయన సీఎంగానే ఉంటున్నారు. మరో రెండేళ్ళలో యూపీ ఎన్నికలు ఉన్నాయి. ఇక యోగీ యూపీ సీఎం అయ్యేంతవరకూ ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆయన సీఎం అయ్యాక తనకంటూ ఒక ఇమేజ్ ని సొంతం చేసుకున్నారు. అంతే కాదు ఆయన యూపీలో తనదైన శైలిలో పాలన చేస్తున్నారు. కరడు కట్టిన హిందూత్వకు ఆయన ప్రతిరూపంగా కనిపిస్తారు. ఆయన హయాంలోనే యూపీలో అయోధ్యలో రామమందిరం సాధ్యపడింది. యోగీ బ్రహ్మచారి. సనాతన ధర్మ నిష్ఠా గరిష్టుడు. ఏ బాదరబందీ లేనివారు. తన సొంత కుటుంబాన్నే ఆయన రాజకీయాలకు అధికారానికీ దూరం ఉంచారు. ఇలా చూస్తే కనుక యోగీకి ఎన్నో ప్లస్ పాయింట్స్ కనిపిస్తాయి. మోడీ కనుక ప్రధాని పదవి నుంచి దిగిపోతే యోగీనే తరువాత పీఈం గా చేయాలని ఆర్ఎస్ఎస్ గట్టిగా తపన పడుతోంది అని ప్రచారంలో అయితే ఉంది. అయితే మోడీ కనుక అనివార్యంగా తన పదవి నుంచి తప్పుకుంటే కనుక తన వారసుడిగా అమిత్ షా పేరునే సూచిస్తారు అని అంటున్నారు. గత పదకొండేళ్లుగా చూస్తే కనుక బీజేపీలోనూ ప్రభుత్వంలోనూ మోడీ అమిత్ షాలదే పట్టు అన్నది కూడా చెబుతారు. అంతే కాదు మోడీ కంటే కూడా సంస్థాగతంగా అమిత్ షా పట్టు సాధించి ఉన్నారని అంటారు. బీజేపీలోనూ ప్రభుత్వంలోనూ అన్ని వ్యవహారాలూ అమిత్ షాయే దగ్గరుండి చూసుకుంటారు అని కూడా చెబుతారు. ఇదంతా మోడీ తర్వాత ఆయనే అని బలమైన సంకేతాలు ఇస్తున్నాయి. మోడీ అమిత్ షా ఇద్దరూ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు. మోడీ దిగిపోతే అదే రాష్ట్రానికి చెందిన వారికే చాన్స్ దక్కాలని కూడా ఉంటుందని అంటారు. అంతే కాదు మొరార్జీ దేశాయ్ తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల తరువాత గుజరాత్ నుంచి దేశానికి ప్రధాని అయ్యే చాన్స్ వచ్చింది. మళ్ళీ ఇపుడు కాకపోతే మరెప్పుడు అన్నట్లుగా ఉంటుంది కాబట్టి అమిత్ షానే ప్రకటించవచ్చు అన్నది కూడా మరో చర్చ. ఇక ప్రధాని పీఠానికి అతి సమీపంలో అమిత్ షా ఉన్నారని కూడా ఈ సందర్భంగా చెబుతారు. ఇక చూస్తే ఆర్ఎస్ఎస్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అమిత్ షా ప్రధాని కావడానికి అంగీకరించదని కూడా అంటున్నారు. బీజేపీని వ్యక్తి పూజ నుంచి తిరిగి బయటకు తెచ్చి సంస్థాగతంగా బలోపేతం చేయాలని సిద్ధాంత పునాదుల మీదనే పార్టీని పునర్ నిర్మించాలని ఆర్ఎస్ఎస్ భావిస్తోంది అని అంటున్నారు. ఈ క్రమంలోనే యోగీకే ఆర్ఎస్ఎస్ జై కొడుతుందని ఆయనకే పట్టం కట్టాలని తన డిమాండ్ గా ముందు పెడుతుందని అంటున్నారు. అంటే మోడీ దిగిపోతే కనుక ఆర్ఎస్ఎస్ బీజేపీల మధ్య ఈ విషయంలో ఒక అభిప్రాయ భేదం అయితే రావచ్చు అని అంటున్నారు. బీజేపీలో ఆర్ఎస్ఎస్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో కూడా తాను కోరుకున్న వారిని ప్రధాని పీఠం మీద కూర్చోబెట్టే విషయంలో తెలుస్తుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఆర్ ఎస్ ఎస్ మాత్రం భారీ వ్యూహంతోనే ఉందని చెబుతున్నారు. ఊరకే 75 ఏళ్ళకే తప్పుకోవాలని అనలేదని అంటారు. తిరిగి బీజేపీని పూర్తిగా తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని తాను అనుకున్న వారే ప్రధాని కావాలన్న సంఘ్ పంతం పట్టుదల ఎంతమేరకు నెగ్గుతుంది అన్నది రానున్న కాలమే తేల్చుతుంది అని అంటున్నారు.

# నారా లోకేష్ ట్వీట్ కు అలా స్పందించిన కర్ణాటక మంత్రి!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచీ రాష్ట్రానికి పెద్ద ఎత్తున దేశీయ, అంతర్జాతీయ సంస్థలను పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆయా సంస్థలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి వివరిస్తున్నారు. ఈ సమయంలో తాజాగా ఏరో స్పేస్ పరిశ్రమను ఏపీకి ఆహ్వానిస్తూ మంత్రి లోకేష్ చేసిన ట్వీట్ కు కర్ణాటక మంత్రి స్పందించారు.అవును... కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ప్రతిపాదిత ఏరోస్పేస్ పార్క్ కోసం దేవనహళ్లీ తాలుకాలో 1777 ఎకరాల వ్యవసాయ భూములను సేకరించే ప్రతిపాదనను కర్నాటక ప్రభుత్వ విరమించుకుంటుందని.. సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. దీంతో.. ఇది నిరసన తెలుపుతున్న రైతులకు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు.ఈ సందర్భంగా స్పందించిన సీఎం సిద్ధరామయ్య... తాము భూసేకరణ ప్రక్రియను నిలిపివేశామని.. అయితే, కొంతమంది రైతులు స్వచ్ఛందంగా తమ భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని.. వారి నుంచి మాత్రమే ప్రభుత్వం భూములను సేకరిస్తుందని.. వారికి అధిక పరిహారంతోపాటు, డెవలపింగ్ చేసిన ప్లాట్ లను అందిస్తామని అన్నారు.ఈ విషయంపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్... ఈ విషయం తెలిసిన తర్వాత తనకు బాధగా ఉందని.. మీ కోసం తమ దగ్గర మంచి ఆలోచన ఉందని.. మీరు ఆంధ్రప్రదేశ్ వైపు ఎందుకు చూడకూడదు? అంటూ ఏరో స్పేస్ ఇండస్ట్రీని ప్రశ్నించారు. మీ కోసం మా వద్ద ఆకర్షణీయమైన ఏరోస్పేస్ పాలసీ ఉందని ఎక్స్ వేదికగా తెలిపారు.ఇదే సమయంలో... అత్యుత్తమ ప్రోత్సాహకాలతో పాటు 8000 ఎకరాలకు పైగా భూమి సిద్ధంగా ఉందని చెబుతు... త్వరలో మిమ్మల్ని కలవాలని ఆశిస్తున్నట్లు ఏరో స్పేస్ ప్రతినిధులకు తెలిపారు! ఈ నేపథ్యంలోనే కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. ఈ సందర్భంగా సుదీర్ఘ పోస్టు పెట్టారు.ఇందులో భాగంగా... కర్ణాటక భూమిని మాత్రమే అందించదని.. ఇది భారతదేశంలో నంబర్ 1 ఏరోస్పేస్ %డ% డిఫెన్స్ ఎకోసిస్టమ్ ను అందిస్తుందని.. తామంతా దశాబ్దాలుగా దేశంలోనే బలమైన ఏరోస్పేస్ స్థావరాన్ని నిర్మించామని.. భారతదేశ ఏరోస్పేస్ ఉత్పత్తిలో 65% తోడ్పడి జాతీయంగా, ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 స్థానంలో నిలిచామని ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఇది భూమి గురించి మాత్రమే కాదని.. ఇది ప్రతిభ, ఆవిష్కరణ, నిరూపితమైన ఎకోసిస్టమ్ గురించని తెలిపారు. ఏమి చేయాలో, ఎప్పుడు చేయాలో, ఎలా చేయాలో మాకు తెలుసని.. ఏమీ జారిపోదని అన్నారు. %వి%1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను చేరుకున్న మొదటి రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి అవుతుందని స్పష్టం చేశారు.ఇదే సమయంలో... ఇది ఏరోస్పేస్ మాత్రమే కాదు.. అనేక కొత్త పరిశ్రమలు కర్ణాటకను ఎంచుకుంటూనే ఉన్నాయని తెలిపారు. వృద్ధి, కొత్త పెట్టుబడులు రెండింటికీ మద్దతు ఇవ్వడానికి అవసరమైన భూమి మరియు ఎకోసిస్టమ్ ను తాము ఎల్లప్పుడూ నిర్ధారిస్తామని అన్నారు. ఈ సందర్భంగా... ఏపీకి కూడా బెస్ట్ విషెస్ చెప్పారు.

# మా పోలీసులు.... కూటమి పోలీసులూ.... జగన్ కామెంట్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** తన ప్రభుత్వం హయాంలో పోలీసులు ప్రజలతో ఎంతో ఫ్రెండ్లీగా ఉండేవారని ప్రజలకు అనుకూలంగా పోలీసులు ఆ రోజు ఉన్నారంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ అవుతున్నాయి. ఆనాడు పోలీసులను ఉపయోగించి విపక్షాలను కట్టడి చేసే ప్రయత్నం చేయడం జరిగిందనే కదా అంతా మొత్తుకున్నారని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

ఏపీలో ఒక చెడు సంప్రదాయం అంటూ వచ్చిందంటే అది వైసీపీ హయాంలోనే కదా మొదలైంది అని గుర్తు చేస్తున్నారు. కూటమి ఏలుబడిలో పోలీసులు తమను తమ పార్టీ వారిని కట్టడి చేస్తున్నారు అని జగన్ విమర్శలు చేసే క్రమంలో తామేంతో మంచి పోలీసింగ్ వ్యవస్థను అందించామని చెప్పుకోవడం పట్ల ప్రతి విమర్శలు వస్తున్నాయి.

ఆనాడు పోలీసులు ప్రజల సమస్యలను సామరస్యంగా పరిష్కరించారాని అంతే కాక టీడీపీ జనసేన వంటి ప్రతిపక్ష పార్టీల సమస్యలను కూడా పరిష్కరించారని జగన్ చెప్పుకొచ్చారు. తమ హయాంలో పోలీసులు గర్వంగా గౌరవంగా పనిచేసారు అని జగన్ చెప్పారు. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు అమలు చేసామని అన్నారు అంతే కాదు స్పందన వంటి కార్యక్రమల ద్వారా పరిష్కారాలు చూపామని జగన్ చెప్పారు. ప్రతిపక్షాలకే ఎక్కువ న్యాయం చేశామని జగన్ అంటున్నారు.అయితే జగన్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విమర్శలకు దారితీస్తున్నాయి. నిజానికి వైసీపీ ఏలుబడిలోనే రాజకీయ నాయకులనే కాకుండా అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకోవడానికి పోలీసులను అధికారాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని టీడీపీ, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీలు తీవ్రమైన ఆరోపణలు చేశాయని పాత విషయాలను చాలా మంది నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా ఎత్తి చూపుతున్నారు.అంతే కాదు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అనేక సంఘటనల గురించి కూడా వారు ప్రస్తావిస్తున్నారు. విశాఖలో చూస్తే డాక్టర్ సుధాకర్‌ను అరెస్టు చేసిన తీరు వివాదాస్పదం అయిందని గుర్తు చేస్తున్నారు. అంతే కాకుండా ఆనాటి వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజును అరెస్టు చేసిన విధానం కానీ అదే విధంగా అనేక మంది టీడీపీ, జనసేన నాయకులు అరెస్టు చేసిన తీరు కానీ తలచుకున్న వారు ఏమి గర్వంగా నాడు పని చేయించారు అని ఎదురు ప్రశ్నిస్తున్నారు.జగన్ హయాంలో పోలీసులు ప్రజలకు అనుకూలంగా కాకుండా వైసీపీ తనకు అనుకూలంగా మార్చుకుందని కూడా నిందిస్తున్నారు. జగన్ తాజా ప్రకటనలు పాత విషయాలను వేరే విధంగా మార్చి చెప్పడమే అని అంటున్నారు. అలా చేసినా కూడా అవి మాసిపోవని అంటున్నారుఇక జగన్ కూటమి ప్రభుత్వం మీద పోలీసుల మీద తీవ్ర విమర్శలు అయితే చేశారు. కూటమి పాలనలో పోలీసులను ముందు పెట్టి తమను అణచేందుకు ప్రయత్నం చేస్తున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలనలో తాను చేసిన అనేక పర్యటనలో తన మీద తన పార్టీ కార్యకర్తల మీద కేసులు పెడుతూ భయానక వాతావరణ సృష్టిస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు.చంద్రబాబుకు మూడ్ ఉంటేనే తనకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ దక్కుతోందని లేకపోతే లేదని ఆయన విమర్శించారు. సత్తెనపల్లి, పొదిలి సహా తన పర్యటనలలో అల్లర్లు అలజడి సృష్టించాలని ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తన సభలకు జనాలు రావడం తాను ప్రజా సమస్యల మీద మాట్లాడడం కూటమి పెద్దలకు ఏమాత్రం నచ్చడం లేదని జగన్ అన్నారు ఇక గుంటూరు మిర్చియార్డులో తాను రైతులను పరామర్శిస్తే తనపైనే తిరిగి కేసులు పెట్టారని జగన్ విమర్శించారు.కూటమి పెద్దలు తమకు నచ్చని పోలీసు అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలా అనేక మంది అధికారులను ఖాళీగా కూర్చోబెట్టారని అన్నారు. ఈ అవమానాలు భరించలేక సిద్ధార్ధ్ కౌశల్ వంటి మంచి పోలీసు అధికారులు రాష్ట్రాన్ని వదిలి వెళ్ళిపోతున్నారని జగన్ అన్నారు. ఇక డీజీ స్థాయి అధికారులు అయిన పీఎస్ ఆర్ ఆంజనేయులు, సునీల్ కుమార్, డీఐజీ విశాల్ గున్నీ లాంటి అధికారుల మీద తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు సస్పెండ్ చేస్తున్నారని జగన్ మండిపడ్డారు.తనకు అనుకూలంగా ఉన్న పోలీసు అధికారులను పెట్టుకుని అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. మద్యం ఇసుక బెల్ట్ షాపుల విషయంలో ఏమి జరిగినా ఒక గ్యాంగ్ ని పెట్టి మరీ వసూళ్ళు బెదిరింపులు వసూలు చేస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీలో అక్రమ కలెక్షన్ జోరుగా సాగుతోందని పెదబాబు చినబాబు స్థాయిలోకి అందుతోందని అన్నారు.

# కంటికి కనిపించని అతిపెద్ద ఆన్ లైన్ చీకటి సామ్రాజ్యం గురించి తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** మామూలు సెర్చ్ ఇంజిన్లకు ఇది చిక్కదు.. యాక్సెస్ చేయడం అందరివల్లా కాదు.. దీన్ని యాక్సెస్ చేయాలంటే ప్రత్యేకమైన బ్రౌజర్లు కావాలి.. గూగుల్, యాహూ, ఫైర్ ఫాక్స్ వంటి ఓపెన్ వెబ్ బ్రౌజర్లతో ఇది సాధ్యం కాదు.. తమ ఐడెంటిటీ గోప్యంగా, అజ్ఞాతంగా ఉండాలని కోరుకునేవారికిది ఓ రక్షణ స్థావరాన్ని సృష్టిస్తుంద.. అదే ఆన్ లైన్ చీకటి సామ్రాజ్యం.. డార్క్ వెబ్.

అమెరికా నేవల్ రిసెర్చ్ లేబరేటరీ అప్పట్లో ద ఆనియన్ రూటింగ్ ప్రాజెక్ట్ (టోర్) ప్రాథమిక వెర్షన్ తో 90ల్లోనే దీనికి పునాది పడింది. పేరుకు తగ్గట్టుగా ఇది ఉల్లి పొరల మాదిరిగా కమ్యూనికేషన్ నెట్ వర్క్ లో ఎన్క్రిప్షన్ లను పొందుపరుస్తుంది. ఆన్ లైన్ గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో రోజర్ డింగెల్ డైన్, ఆయన బృందం టోర్ ను రూపొందించింది.ఇది డేటాను ఎన్ క్రిప్ట్ చేయటం ద్వారా యూజర్ చిరునామాను దాచి పెడుతుంది. మొదట్లో మంచి ఉద్దేశం కోసం రూపొందించినప్పటికీ క్రమక్రమంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకోవటం ఎక్కువైంది.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల వంటి పనులకు ఇది ప్రసిద్ధి చెందింది. ఇటీవల కేరళకు చెందిన ఒకరు ఇందులో డ్రగ్స్ అమ్ముతున్నందుకు గాను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఇది ఇలా పూర్తిగా డ్రగ్స్, సైబర్ నేరాలు, తుపాకుల అమ్మకాలు మొదలైన అక్రమ కార్యకలాపాలకు పెట్టింది పేరైనట్లుగా ఉన్నప్పటికీ... ఈ డార్క్ వెబ్ కొన్ని మంచి పనులకూ ఉపయోగపడుతోంది! ఇందులో భాగంగా.. గూఢచారులు, జర్నలిస్టులు మొదలైనవారు పీడిత పాలనలో రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవటానికి దీన్ని వాడుకుంటుంటారు.తమ డేటాను కాపాడుకోవటానికి కొన్ని ఆసుపత్రులు, ఇతర సంస్థలు సైతం దీన్ని వాడుకుంటున్నాయని చెబుతున్నారు. అయితే ఈ అజ్ఞాత ధోరణే సైబర్ నేరాలకు ఊతమిస్తోందని అంటున్నారు. ప్రధానంగా... డ్రగ్స్, దొంగ నోట్లు, మాల్వేర్ లావాదేవీలకు ఇక్కడ ఆస్కారం కల్పిస్తోంది.ఈ నేపథ్యంలోనే... ప్రపంచవ్యాప్తంగా చట్టపరమైన సంస్థలు డార్క్ వెబ్ వ్యవహారాలనూ ఓ కంట కనిపెడుతూనే ఉంటాయి. అయితే... అధునాతన ఎన్ క్రిప్షన్ పద్ధతుల మూలంగా నేరగాళ్లను గమనించటం ఇటీవల పెద్ద సమస్యగా నిలుస్తోందని అంటున్నారు. అయినప్పటికీ అధునాతన విధానాలతో పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నారు. వాస్తవానికి వెబ్ సైట్ లు సాధారణంగా ".కాం" మరియు ".ఆర్గ్" వంటి రిజిస్ట్రీ ఆపరేటర్ లతో లేబుల్ చేయబడతాయి. ప్రసిద్ధ సెర్చ్ ఇంజిన్ లతో సులభంగా గుర్తించబడతాయి. అతితే... ఈ డార్క్ వెబ్ లో వెబ్ సైట్లు ".ఆనియన్" డొమైన్లను వాడు కుంటాయి. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల ఇండెక్స్ లో ఇవి ఉండవు. సాధారణంగా 'టోర్'ను డౌన్ లోడ్ చేసుకొని డార్క్ వెబ్ ను ఉపయోగించుకుంటారు. ఇది నోడ్స్ అని పిలుచుకునే పలు సర్వర్ల ద్వారా కనెక్షన్లను దారి మళ్లిస్తుంది. ఈ క్రమంలో ప్రతి దశలోనూ డేటాను రహస్య లిపిలోకి మారుస్తుంది. అందువల్ల డార్క్ వెబ్ లో జరిగే వ్యవహారాలను పట్టుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవచ్చు.

# బ్లడ్ మనీ వద్దు.. కేరళ నర్సు కేసులో ఊహించని ట్విస్ట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** యెమెన్‌లో దోషిగా నిలిచిన కేరళ నర్సు నిమిష ప్రియ కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఆమెకు విధించిన మరణశిక్ష నేడు అమలవ్వాల్సి ఉండగా, యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా ఆ శిక్షను వాయిదా వేసిన విషయం కాస్త ఊరటనిచ్చింది. అయితే, బాధిత కుటుంబం మాత్రం శిక్ష అమలే జరగాలని గట్టిగా అభిప్రాయపడుతోంది.

**బ్లడ్‌మనీని తిరస్కరించిన మృతుడి కుటుంబం**

యెమెన్ పౌరుడైన తలాల్ అదిబ్ మెహదిని హత్య చేసిన కేసులో నిమిష ప్రియకు శిక్ష విధించారు. ఈ శిక్ష నుంచి బయటపడేందుకు ఆమె కుటుంబం బ్లడ్‌మనీ (క్షమాధనం) కింద 1 మిలియన్ డాలర్లు (సుమారు రూ.8.6 కోట్లు) చెల్లించేందుకు సిద్ధమైంది. అయితే, మృతుడి సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహది బ్లడ్‌మనీని తిరస్కరించారు. "నేరానికి క్షమాపణ ఉండదు, బ్లడ్‌మనీని మేము తిరస్కరిస్తున్నాం" అని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన ఆయన, "మధ్యవర్తిత్వాలు, ఒత్తిడులు కొత్తవి కావు. మేము ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. డబ్బుతో ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే" అని తేల్చిచెప్పారు. అలాగే నిమిషను బాధితురాలిగా చూపించే ప్రయత్నాలను ఖండించారు.

**-భారత ప్రభుత్వం కృషి.. తాత్కాలిక ఊరట**

నిమిష ప్రియ మరణశిక్షను వాయిదా వేయించిన విషయం భారత విదేశాంగ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. యెమెన్ జైలు అధికారులు, ప్రాసిక్యూషన్ కార్యాలయంతో సంప్రదింపులు జరిపినట్టు తెలిపింది. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి రావాలని కోరుతూ గత కొద్ది రోజులుగా యెమెన్ ప్రభుత్వంపై భారత్ ఒత్తిడి తెచ్చిందని పేర్కొంది.

**మతగురువు మౌనవాదం.. పరిష్కార మార్గం?**

ఈ కేసును పరిష్కరించేందుకు మతపరంగా కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రముఖ ముస్లిం మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ బాధిత కుటుంబాన్ని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నారు. బ్లడ్‌మనీ తీసుకునేందుకు వారిని ఒప్పించాలన్న దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. అయితే ఈ చర్చలు ఎంతవరకు ఫలిస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది. నిమిష ప్రియ జీవితం ఇప్పుడు యెమెన్ న్యాయవ్యవస్థ, మానవతా విలువల మధ్య జరుగుతున్న సంక్లిష్ట పరిస్థితిపై ఆధారపడిపోయింది. బాధిత కుటుంబం క్షమించకపోతే.. శిక్ష తప్పే అవకాశాలు కాస్త సంక్లిష్టంగా మారతాయి. మరోవైపు, మానవతా దృష్టితో నిమిషకు రెండో అవకాశం ఇవ్వాలన్న భావన కూడా పలు వర్గాల్లో ప్రతిధ్వనిస్తోంది. అయినా చట్టం, దయ మధ్య ఆఖరి నిర్ణయం ఎవరిది? అనేదే ఇప్పుడు అంతులేని చర్చకు దారి తీస్తోంది.

## సగం ర్యాంకులు కంగారులవే.. టాప్-10లో ఐదుగురు ఆసీస్ బౌలర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ లో ఆస్ట్రేలియా ఆధిపత్యం చూపిస్తుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టులో ఐదుగురు బౌలర్లు బుధవారం (జూలై 16) ఐసీసీ విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్- 10లో చోటు దక్కించుకోవడం విశేషం. మొన్నటి వరకు కంగారూల తుది జట్టులో స్థానం సంపాదించుకోలేని స్కాట్ బోలాండ్ కూడా టాప్-10 కు చేరుకోవడం ఆసక్తికరంగా మారింది. కమ్మిన్స్, హేజిల్ వుడ్, బోలాండ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్ టాప్-10 లో ఉన్నారు. ఆసీస్ కెప్టెన్ కమ్మిన్స్ 838 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. కమ్మిన్స్ టెస్టుల్లో గత కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్నాడు. కెప్టెన్సీతో పాటు బౌలింగ్ లోనూ సత్తా చూపిస్తున్నాడు.

కమ్మిన్స్ తర్వాత మరో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజల్ వుడ్ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ లో నాలుగో స్థానంలో ఉన్నాడు. హేజల్ వుడ్ ఖాతాలో ప్రస్తుతం 815 పాయింట్లు ఉన్నాయి. స్కాట్ బోలాండ్ ఏకంగా ఆరో స్థానానికి దూసుకొచ్చాడు. ఈ ఏడాది ప్రారంభంలో టీమిండియాతో జరిగిన టెస్ట్ సిరీస్ లో అత్యుత్తంగా రాణించిన స్కాట్.. ఇటీవలే వెస్టిండీస్ పై జరిగిన చివరి టెస్టులో తుది జట్టులో స్థానం సంపాదించి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో బోలాండ్ హ్యాట్రిక్ తో చెలరేగాడు. దీంతో పింక్ బాల్ టెస్ట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి బౌలర్ గా చరిత్ర సృష్టించాడు. జస్టిన్ గ్రీవ్స్, షమర్ జోసెఫ్, జోమెల్ వారికన్‌లను వరుస బంతుల్లో బోలాండ్ ఔట్ చేశాడు.

ఆస్ట్రేలియా ప్రధాన స్పిన్నర్ నాథన్ లియాన్ 769 పాయింట్లతో 8 ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. దశాబ్ద కాలంగా ఆసీస్ జట్టులో లియాన్ ఏకైక స్పిన్నర్ గా కొనసాగుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. యార్కర్ల వీరుడు మిచెల్ స్టార్క్ పదో స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్ తో జరిగిన చివరి టెస్టులో స్టార్క్ తన బౌలింగ్ తో విజృంభించి కేవలం 15 బంతుల్లోనే ఐదు వికెట్లు పడగొట్టి ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఫాస్టెస్ట్ 5 వికెట్లు పడగొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. బుమ్రా అగ్ర స్థానంలో ఉండగా రబడా రెండో ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. హెన్రీ(7), నోమన్ అలీ(5), మార్కో జాన్సెన్(9) టాప్-10 లో ఉన్న ఆటగాళ్లు.

## ఇండియా కూడా తప్పు చేసింది ఇంగ్లాండ్‌కే ఎందుకు పనిష్ మెంట్: ఐసీసీపై వాన్ అసంతృప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ మధ్య ఇటీవలే జరిగిన మూడో టెస్టు థ్రిల్లర్ ను తలపించింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఈ టెస్ట్ అసలైన టెస్ట్ క్రికెట్ మజా చూపించింది. ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఈ టెస్టులో ఇంగ్లాండ్ 22 పరుగుల తేడాతో ఇండియాపై థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. తొలి నాలుగు రోజులు టీమిండియా ఆధిపత్యం చూపించినా చివరి రోజు ఇంగ్లాండ్ అద్భుతమైన బౌలింగ్ తో సంచలన విజయం విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ ఫుల్ ఖుషీగా ఉంటే ఐసీసీ ఊహించని షాక్ ఇచ్చింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లాండ్ జట్టుపై 10 శాతం జరిమానా విధించడమే కాదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ లో రెండు పాయింట్లు కట్ చేసింది. ఈ టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లాండ్ జట్టుకు మాత్రమే జరిమానా విధించినందుకు ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)ను బహిరంగంగా విమర్శించాడు. సోషల్ మీడియా ద్వారా ఈ ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ తన నిరాశను వ్యక్తం చేస్తూ.. "నిజాయితీగా చెప్పాలంటే, లార్డ్స్‌లో రెండు జట్ల ఓవర్ రేట్లు చాలా చాలా పేలవంగా ఉన్నాయి. ఒక్క జట్టును ఎలా మందలించారో నాకు అర్థం కాలేదు. న్యాయంగా ఉండటం అత్యంత ముఖ్యమైది. అన్ని జట్లకు క్రికెట్ పాలక మండలి సమాన న్యాయం అందేలా చూడాలి". అని వాన్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో రాసుకొచ్చాడు. లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ జట్టు ఇండియా రెండో ఇన్నింగ్స్ లో 10 నిమిషాల పాట (రెండు ఓవర్లు ఆలస్యం) ఆలస్యం అయినట్టు.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ నేరానికి పాల్పడినట్లు ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ రూల్స్ లో భాగంగా ఆర్టికల్ 16.11.2 ప్రకారం ఒక జట్టుకు ప్రతి తక్కువ ఓవర్‌కు ఒక పాయింట్ జరిమానా విధించబడుతుంది. ఇంగ్లాండ్ రెండు ఓవర్లు ఆలస్యం వేసిన కారణంగా



రెండు పాయింట్లలో కొత్త విధించారు. పాయింట్లు కట్ చేయడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో ఇంగ్లాండ్ 24 నుండి 22కి పడిపోయింది. దీంతో వారి పాయింట్ల శాతం 66.67% నుండి 61.11%కి తగ్గింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఆలౌటైంది. రూట్ (104) సెంచరీతో టాప్ స్కోరర్ గా నిలిచాడు, బుమ్రా 5 వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ లో ఇండియా కూడా సరిగ్గా 387 పరుగులు చేసింది. రాహుల్ సెంచరీ చేసి ఇండియాను ఆదుకున్నాడు. భారత బౌలర్లు విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 192 పరుగులకే ఆలౌట్ అయింది. 193 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 170 పరుగులకు ఆలౌట్ అయింది.

## నువ్వు సూపర్ స్టార్ అయినా అలా చేయడానికి కుదరదు: బుమ్రాకు గవాస్కర్ వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నాలుగో టెడ్స్ ఆడతాడా లేదా అనే విషయంపై సస్పెన్స్ కొనసాగుతోంది. పని భారం కారణంగా ఈ స్పీడ్ స్టార్ సిరీస్ లో ఏవైనా మూడు మ్యాచ్ లు మాత్రమే ఆడనున్నాడు. ఇప్పటికే బుమ్రా రెండు మ్యాచ్ లు ఆడేశాడు. మిగిలిన రెండు టెస్టుల్లో ఒకటే మ్యాచ్ ఆడతాడనే టాక్. రెండో టెస్టుకు ముందు ముందే బుమ్రా సిరీస్?లోని ఏవైనా మూడు మ్యాచులు మాత్రమే ఆడుతాడని.. మిగిలిన రెండు మ్యాచ్ ల్లో అతడి సేవలు కోల్పోతామని గిల్ రెండో టెస్టుకు ముందు క్లారిటీ ఇచ్చాడు. దీంతో బుమ్రా నాలుగో టెస్ట్ ఆడతాడా లేకపోతే ఐదో టెస్ట్ టెస్టులో బరిలోకి దిగుతాడా అనే విషయంపై చర్చల జరుగుతున్నాయి. 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ప్రస్తుతం ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఇండియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మాంచెస్టర్ లో జూలై 23 నుంచి ప్రారంభమవుతుంది. సిరీస్ లో వెనకబడిన టీమిండియా ఓల్డ్ ట్రాఫర్డ్ లో జరగబోయే నాలుగో టెస్టులో ఓడిపోయితే సిరీస్ కోల్పోతుంది. దీంతో నాలుగో టెస్టులో ఎలాగైనా గెలవాలనే ఒత్తిడి భారత జట్టుపై ఉంది. ఈ మ్యాచ్ లో బుమ్రాకు రెస్ట్ ఇస్తారనే విషయంలో వస్తున్న ప్రచారంలో భాగంగా టీమిండియా దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించాడు. ఈ టీమిండియా స్టార్




పేసర్ కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చాడు. గవాస్కర్ మాట్లాడుతూ.."ఏ సూపర్ స్టార్ ఆటగాడూ విశ్రాంతి తీసుకోకూడదు. మీరు ఇక్కడకు సెలవుల కోసం రాలేదు" అని గవాస్కర్ సోనీ స్పోర్ట్స్‌లో అన్నారు. గవాస్కర్ బుమ్రాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు స్పష్టంగా అర్థమవుతుంది. టీమిండియా వెటరన్ బ్యాటర్ చటేశ్వర్ పుజారా బుమ్రా చివరి టెస్ట్ ఆడకపోయినా పర్లేదు సిరీస్ కు కీలకమైన నాలుగో టెస్ట్ ఆడాలని సూచించాడు. మూడో టెస్ట్ ముగిసిన తర్వాత నాలుగో టెస్టుకు 10 రోజుల విరామం ఉంది. విరామం ఎక్కువ రావడంతో బుమ్రా నాలుగో టెస్ట్ ఆడాలని గవాస్కర్ గట్టిగా చెప్పాడు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బుమ్రా ఆడాడు. ఈ మ్యాచులో ఈ పేసర్ చెలరేగి తొలి ఇన్నింగ్స్ లో ఐదు పడగొట్టిన టీమిండియాకు ఓటమి తప్పలేదు. రెండో టెస్టులో టీమిండియా ఖచ్చితంగా గెలవాల్సిన టెస్టులో బుమ్రా ఆడతాడని ప్రచారం జరిగినా అతనికి రెస్ట్ ఇవ్వడం జరిగింది. బుమ్రా లేని ఈ టెస్టులో టీమిండియా 336 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తాజాగా ముగిసిన లార్డ్స్ టెస్టులో బుమ్రా రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన టీమిండియా 22 పరుగుల తేడాతో ఓడిపోయింది.



చైత్ర జె ఆచార్ క్లాసిక్ బ్లాక్ అండ్ వైట్ చీరలో వింటేజ్ కూల్‌ను ప్రసరిస్తుంది

## 'డాన్ 3' విలనీ: VD ఎగ్జిట్‌కి కారణమేమిటి?



కింగ్ ఖాన్ షారూఖ్ ని కాదనుకుని ప్రస్తుతం రణ్‌వీర్ సింగ్ ని డాన్ పాత్రలో చూపించేందుకు ప్రయత్నిస్తున్నాడు ఫర్హాన్ అక్తర్. అతడు %-%డాన్%-% ఫ్రాంఛైజీలో మూడో భాగం %-%డాన్ 3%-%ని ప్రకటించి చాలా కాలమే అయినా చిత్రీకరణ ప్రారంభం కావడానికి ఏళ్లుగా ఎదురు చూడాల్సి వచ్చింది. ఇప్పటికీ ఈ సినిమాకు సరైన విలన్ దొరక్కపోవడం నిరాశపరుస్తోంది. షారూఖ్ మొదటి రెండు భాగాల్లో అద్భుత నటనతో ప్రజల్ని అలరించాడు. ఇప్పుడు రణ్ వీర్ ఈ పాత్రలో ఎలా మెప్పిస్తాడో చూడాలన్న ఆసక్తి ఉంది. అయితే ఈ ప్రాజెక్ట్ అంతకంతకు ఆలస్యమవుతున్నట్టే కనిపిస్తోంది. డాన్ 3లో విలన్ గా ప్రతిభావంతుడైన యువనటుడు విక్రాంత్ మాస్సేకు అవకాశం కల్పించినా తిరస్కరించాడని కథనాలొచ్చాయి. సృజనాత్మక అసంతృప్తి కారణంగా విక్రాంత్ ఈ పాత్రను వదులుకున్నట్టు ప్రచారం సాగుతోంది. అతడు రిజెక్ట్ చేసాక, అదే పాత్ర కోసం టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండను దర్శకనిర్మాతలు సంప్రదించారని కూడా కథనాలొచ్చాయి. వీడీ కూడా ఈ పాత్రను కాదనుకున్నాడు. ప్రస్తుతం దేవరకొండ తెలుగులో వరుస చిత్రాలకు కాల్షీట్లు ఇచ్చాడు. అలాగే దీర్ఘ కాలిక ప్రణాళిక ప్రకారం ఈ విలన్ పాత్ర తన ఇమేజ్ కి ఇబ్బందులు క్రియేట్ చేస్తుందని కూడా అతడు భావించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కారణం ఏదైనా కానీ, ఒక భారీ యాక్షన్ చిత్రంలో విక్రాంత్ మాస్సే, విజయ్ దేవరకొండ లాంటి స్టార్లు నటించే అవకాశాల్ని వదులుకోవడం ఆశ్చర్యపరిచింది.

ఫర్హాన్ బృందం తదుపరి ఈ పాత్ర కోసం వేరొక నటుడిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. సృజనాత్మక వైరుధ్యాలు, పాత్ర పరిమితులు, హీరో ఇమేజ్ వగైరా అంశాలు ఈ వైఫల్యానికి కారణం కావొచ్చు. దానిని సరిదిద్దుతూ సరైన నటుడిని ఈ పాత్రకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. రణ్ వీర్ సింగ్ లాంటి ఎనర్జిటిక్ హీరోకు మ్యాచ్ చేసేలా భీకర విలన్ గా ఢీకొట్టడానికి విజయ్ దేవరకొండ సరిపోతాడు. కానీ అతడు నిరాకరించడానికి కారణం ఆ పాత్రను ఆశించినంత పవర్ ఫుల్ గా డిజైన్ చేయకపోవడమేనని భావి స్తున్నారు. అయితే రణ్ వీర్ ఫ్యాషన్ సెన్స్ ని ఫాలో చేసే హీరోగా వీడీకి గుర్తింపు ఉంది. అందుకే భవి ష్యత్ లో ఆ ఇద్దరూ కలిసి నటించాలని కూడా అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



నభా నటేష్ లైమ్ ఎల్లో మరియు పాతకాలపు వైబ్స్‌లో మెరుస్తోంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com